

ఆలయాల భూముల చుట్టూ అక్రమార్కులు వాలిపోయారు. దేవుడికి మొక్కి రూ.కోట్ల విలువైన స్థలాలను నొక్కేసి పరిస్థితి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దర్శనమిస్తోంది. అటువంటివారికి రాజకీయం దన్నుగా నిలవడం.. దేవాదాయ శాఖ అధికారులు వంత పాడడం పరిపాటైంది. కీలక దస్త్రాలు మాయమవుతున్నాయి. న్యాయపరమైన చిక్కులు తెరమీదికి వస్తున్నాయి. రాజుల కాలం నుంచి ఆలయాల ధూప దీప నైవేద్యాలకు నిర్దేశించిన దేవుడి మాన్యాలకి.. దాతలు ఉదారతతో రాసిచ్చిన సత్రం భూములకు రక్షణ లేకుండా పోయింది.

- ఈనాడు, కాకినాడ
- న్యూస్‌టుడే, గాంధీనగర్

దేవుడా.. నీ భూమీ వదల్లేదు!

రూ.కోట్ల విలువైన మాన్యం, సత్రం స్థలాలు స్వాహా

పేరుకే రీజు... అంతా గలీజు..

కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి 889.77 ఎకరాల భూమి ఉంది. 26 ఎకరాల్లో రొయ్యల, చేపల.. 447.77 ఎకరాల పల్లం భూమిలో వరి సాగవుతోంది. 416 ఎకరాల మెరక భూమిలో కొబ్బరి, సరుగుడు తోటలు ఉన్నాయన్నది దేవాదాయ శాఖ లెక్క. ఆ మాన్యం చేతులు మారిపోయింది. 70 ఎకరాల్లో అనుమతులు లేకుండా రొయ్యల చెరువులు ఏర్పాటయ్యాయి. కొంత భూమి స్థిరాస్తి వ్యాపారులు జరిగితే.. మరి కొంత కట్టుకానుకల కింద రాసిచ్చేశారు.

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ఆలయాలు, సత్రాలు, మఠాలకు చెందిన రూ.కోట్ల విలువైన భూములు ఉన్నాయి. వీటిలో కొన్ని లీజుల్లో ఉండగా దేవాదాయ శాఖకు వచ్చే ఆదాయం అంతంతే. దశాబ్దాలుగా ఒకరి చేతుల్లోనే ఉండడం.. తక్కువ మొత్తానికి లీజుకు తీసుకుని అధిక మొత్తానికి బయటి వ్యక్తులకు భూములు, భవనాలు లీజుకు ఇవ్వడంపైనా చర్యలు లేవు.

● కాకినాడ జిల్లాలో టైటిల్ వివాదాల్లో 541.17 ఎకరాలు ఉంటే.. కోనసీమలో 366.26 ఎకరాలు, తూర్పు గోదావరిలో 33.57 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 491 ఆలయాలు, సత్రాల ఆస్తుల 9,997.03 ఎకరాలు ఉంటే.. ఇందులో 1,580.75 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నాయి.

● అటవీ, కొండ ప్రాంతాల్లోనూ ఆలయ భూములు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 626.87 ఎకరాలు, తూర్పులో 68.99 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. వీటిలోనూ ఆక్రమణే.

● దేవాదాయ శాఖ ఖాళీ భూములు కాకినాడ జిల్లాలో 2.43 లక్షల చదరపు గజాలు, తూర్పులో 4.09 లక్షల చ.గ, అంబేడ్కర్ కోనసీమలో 2.13 లక్షల చ.గ చొప్పున ఉన్నాయి. వీటి నుంచి లీజుల ద్వారా ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం సమకూరే అవకాశమున్నా చొరవ చూపడంలేదు.

ఉమ్మడి జిల్లాలో ఆస్తులు - ఆక్రమణల చిత్రమిది..

- ఆలయాలు / సత్రాలు: 1,852
- భూములు: 38,963.69 ఎకరాలు
- లీజుకు ఇచ్చినవి: 20,671.42 ఎకరాలు
- ఆక్రమణలు /వివాదాల్లో ఉన్న భూములు: 5,281.66 ఎకరాలు

ఆక్రమణల చెరలో..

● కాకినాడలోని జగ్గనాధపురం సుబ్బారావు సత్రం భూములపై కొందరు కన్నేశారు. సర్వసరంలోని ఎకరం భూమిని కబ్జా చేసేందుకు గత ప్రభుత్వంలో కొందరు ప్రయత్నించారు. న్యాయపరమైన చిక్కులు తెరమీదకి తెచ్చారు. హైకోర్టు బోర్డులు పెట్టినా రక్షణ లేదు.

● జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మీ వెంకయ్యమ్మ ధర్మసత్రానికి 781.53 ఎకరాల భూమి ఉంటే.. 113.37 ఎకరాల్లో న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి. 9.21 ఎకరాలు ఆక్రమణల్లో ఉంది. పదేళ్లుగా ఉన్న భూముల విలువ రూ.100 కోట్లకుపైనే.

● గండేపల్లి మండలం తాళ్లూరు వేణుగోపాలస్వామి ఆలయానికి 228.46 ఎకరాలు ఉన్నాయి. పుష్కర ఎత్తిపోతల పథకం కాలువ కోసం భూ సేకరణకు 70 ఎకరాలు పోతే.. 90 ఎకరాలు ఆక్రమణకు గురయ్యింది. అర్చకుల ఆధీనంలో ఉండాల్సిన 60 ఎకరాల సర్వేకు ఇనాం భూమిలో 40 ఎకరాలకు పైగా చేతులు మారింది.



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూమిలో అనధికారికంగా తవ్విన రొయ్యల చెరువు

ఆక్రమణలు తొలగిస్తాం

ఆలయ భూముల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.. వాటిని తొలగించి పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్తగా బాధ్యతలు స్వీకరించాను. మూడు జిల్లాల ఈవోలతోనూ సమీక్షిస్తాను. ఎక్కడెక్కడ ఆక్రమణలు, న్యాయపరమైన సమస్యలు ఉన్నాయో తెలుసుకుంటాను. ఆస్తుల లీజుల పైనా దృష్టిసారిస్తాం.



- డి.ఎల్.వి.రమేష్‌బాబు, డీసీ, దేవాదాయశాఖ


ఉత్తమ పురస్కారం

అమలాపురం కలెక్టరేట్: మలికిపురం మండలం దిండి గ్రామంలోని ఆర్వీఆర్ సరోవర్ రిసార్ట్స్‌కు ఉత్తమ రిసార్ట్ అవార్డు వచ్చింది. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పర్యాటక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పలు రిసార్ట్‌లు, పర్యాటక ప్రాంతాలకు అవార్డులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో దిండిలోని ప్రైవేటు రిసార్ట్స్‌కు అవార్డు దక్కగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అందుకున్నారు.

కొత్త సర్కిళ్లు.. వెలుగులు

● విద్యుత్తుశాఖ విభజన పూర్తి
● కోనసీమలోనూ ఎస్‌ఈ కార్యాలయం

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, దేవీచౌక్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పునర్విభజన జరిగి రెండున్నరేళ్లవుతున్నా ఇన్నాళ్లూ తూర్పు విద్యుత్తు పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో విభజన జరగలేదు. దీంతో పౌరసేవల్లో ఇబ్బందులు తలెత్తేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సౌకర్యార్థం రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న విద్యుత్తు సర్కిల్ కార్యాలయాన్ని తూర్పుగోదావరి (రాజమహేంద్రవరం), కాకినాడ, కోనసీమ (అమలాపురం)గా విభజిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మాదిరి ఇప్పుడూ ఏడు డివిజన్లే ఉన్నాయి. అయితే ఇప్పటివరకు ఉన్న రంపచోడవరం డివిజన్‌ను పాడేరు కేంద్రంగా ఏర్పడిన కొత్త సర్కిల్‌లో విలీనం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఉన్న నిడదవోలును తూర్పులో కలిపారు. అమలాపురంలోని ఈఈ కార్యాలయం, కాకినాడ డివిజన్ పరిధి రెవెన్యూ విభాగంలో ఎస్‌ఈ కార్యాలయం ఏర్పాటుచేశారు.



సిబ్బంది సర్దుబాటు

ఉమ్మడి జిల్లాలోని అన్ని విభాగాల్లో అధికారులు, సిబ్బంది కలిపి 3368 మంది ఉండగా రాజమహేంద్రవరం సర్కిల్ కార్యాలయంలో 101 మంది వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు. ఇప్పుడు రాజమహేంద్రవరానికి 56, అమలాపురం-51, కాకినాడ సర్కిల్‌కు 52 మందిని కేటాయించారు. కొత్త సర్కిళ్లకు ఎస్‌ఈ, మరో ముగ్గురి నుంచి నలుగురు అధికారుల చొప్పున నియమించిన ప్రభుత్వం ఇతర సిబ్బంది నియామకంపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

విద్యుత్తు కనెక్షన్లు కేటగిరీ వారీగా..

జిల్లా	గృహాలు	వ్యాపార/ వాణిజ్యం	పరిశ్రమలు	ప్రభుత్వ సంస్థలు	వ్యవసాయ / ఆక్వా	హెచ్‌టీ
తూర్పుగోదావరి	6,34,061	76,905	2866	12,999	46,806	566
కోనసీమ	5,36,149	62795	2088	15,261	21,344	270
కాకినాడ	6,55,427	75,682	2495	15,381	24,600	634

కొత్త సర్కిల్ వారీ కేటాయింపు...

అధికారి	రాజమహేంద్ర వరం	కాకి నాడ	కోన సీమ
ఎస్‌ఈ	1	1	1
ఈఈ	3	3	2
డిప్యూటీ ఈఈ	6	6	6
ఏఈఈ	14	12	11
జేఈ	5	4	4
ఏవో	1	0	1
ఎస్‌ఏవో	0	1	1
జేఏవో	4	3	3
సీనియర్ అసిస్టెంట్	11	11	11

(ఏఏవో, డీజీఎం/పీవోలను మూడు జిల్లాలకు ఒక్కొక్కరి చొప్పున.. జూనియర్ అసిస్టెంట్లను ఒక్కో సర్కిల్‌లో 9 మంది చొప్పున నియమించారు)

జిల్లా వారీ డివిజన్లు ఇలా..

☛ తూర్పుగోదావరి: రాజమహేంద్రవరం నగరం, రాజమహేంద్రవరం గ్రామీణం, నిడదవోలు

☛ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ: అమలాపురం, రామచంద్రాపురం

☛ కాకినాడ జిల్లా: కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట

ముందే మేల్కొంటే.. గర్భాశయ క్యాన్సర్ కట్టడి

పీఐఎన్‌సీసీ భారత ప్రతినిధి డా.సమత కడియాల



న్యూస్‌టుడే, మసీదుసెంటర్(కాకినాడ)

అవగాహన లేమి కారణంగా కొన్ని వ్యాధులు ప్రాణాంతకంగా మారుతున్నాయి. తొలి దశలోనే గురిస్తే నివారించవచ్చు. అలాంటివాటిలో సర్వైకల్(గర్భాశయ) క్యాన్సర్ ఒకటి. కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి 26 వరకు మహిళలకు నిర్ధారణ పరీక్షల శిబిరం నిర్వహించారు. అమెరికాకు చెందిన వైద్యులు సేవలందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 350 మందికి పరీక్షలు నిర్వహించగా ప్రాథమికంగా 44 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పీఐఎన్‌సీసీ(ప్రివెంటింగ్ సర్వైకల్ క్యాన్సర్ గ్లోబల్లీ) భారత ప్రతినిధి డాక్టర్ సమత కడియాల 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

హెచ్‌పీవీతో వ్యాప్తి..

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పీవీ) కారణం. లైంగిక చర్యల ద్వారా ఇది వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత సర్వైకల్ క్యాన్సర్‌గా మారుతోంది. అంతవరకు లక్షణాలు కనిపించవు. మూడేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఉనికిని గుర్తించవచ్చు. వెంటనే చికిత్స అందించి పూర్తిగా నయం చేయొచ్చు.

వీఐఏ పరీక్షలతో..

క్యాన్సర్ సంకేతాలను గుర్తించేందుకు విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్(వీఐఏ) పరీక్ష చేస్తారు. వైరస్ ఉంటే థర్మో అబలేటర్ పరికరం ద్వారా చికిత్స అందించి ముప్పు తొలగిస్తారు. వీరు మూడేళ్లకు ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి. మొదటి దశలో క్యాన్సర్‌ను నివారించేందుకు వీలుంది. రెండో దశ నుంచి వంద శాతం నివారణ సాధ్యం కాదు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పరీక్షలకు ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం శిబిరాలు నిర్వహించి సకాలంలో చికిత్స అందించాలి.

నాలుగో వంతు ఇక్కడే..

ప్రపంచంలోని 25 శాతం కేసులు భారత్‌లోనే నమోదవుతున్నాయి. గత మూడు దశాబ్దాల్లో స్వల్ప తగ్గుదల కనిపించినా.. ఏపీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో మార్పు లేదు. మన దేశంలో ఏటా 1,32,000 కేసులు నమోదవుతున్నాయి. 74వేల మంది మృత్యువాత పడుతున్నారు. పీఐఎన్‌సీసీ ద్వారా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాం. సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం.

అంబాజీపేటలో 9.6 మి.మీ వర్షపాతం

రాజోలు: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో శుక్రవారం పడిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేటలో అత్యధికంగా 9.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రాజోలు 9.2, రాయవరం 8.4, కె.గంగవరం 8.2, మామిడికుదురు 7, అమలాపురం 5.2, రామచంద్రపురం 5, కొత్తపేట 4.6, పి.గన్నవరం 4.6, ఆత్రేయపురంలో 4 మి.మీ వర్షపాతం కురిసింది.



రాజోలు పోస్టాఫీసు రోడ్డులో ప్రవాహం

చీకటి పూటా.. ఎలా ఆట!



జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం రాత్రి విద్యుత్తు దీపాలు వేయలేదు. దాంతో వందల మంది క్రీడాకారులు, స్థానికులు, బాలికలు, మహిళలు అసౌకర్యానికి గురయ్యారు. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన స్టేడియంను సక్రమంగా నిర్వహించేందుకు తగిన సిబ్బంది లేకపోవడం ఇక్కడ ప్రధాన సమస్య. దాదాపు 11 ఏళ్ల క్రితం స్టేడియంలో కాపలాదారు ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో తనిఖీ సంస్థను తొలగించిన అధికార యంత్రాంగం ఇంతవరకు ఎవరినీ ఇక్కడ కాపలాకు నియమించలేదు. పోటీల సమయంలో మినహా మిగిలిన రోజుల్లో ఇండోర్ స్టేడియం సిబ్బంది ఇక్కడ కార్యకలాపాలు చూడాల్సివస్తోంది. బాలయోగి స్టేడియంలో చీకటిగా ఉన్న సమస్యను పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

- న్యూస్‌టుడే, యానాం

పరదా పాఠం.. చెలగాటం..!



గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నామని గొప్పలు చెప్పి.. తిప్పలు మిగిల్చింది. క్షేత్ర స్థాయిలో విద్యార్థుల సమస్యలు అలానేఉన్నాయి. అమలాపురం పట్టణ పరిధిలోని 20వ వార్డులో ప్రాథమిక పాఠశాలను అద్దె పెంకుటింటి అరుగుపై నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 50కిపైగా విద్యార్థుల చదువుకుంటున్నారు. వీరికి సరైన వసతుల్లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఎండవానలకు అరుగుకు పరదా కట్టి, దాని వెనుక పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. శుక్రవారం ఉదయం కురిసిన వర్షపునీరు అరుగుపై పడి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై ఎంఈవో సూర్యప్రకాశ్‌ను వివరణకోరగా భవన నిర్మాణానికి పురపాలిక అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. నిధుల కొరత కారణంగా జాప్యం జరుగుతోందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

కేసులు పరిష్కరించండి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగించేవారు, చట్ట విరుద్ధంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ కృష్ణారావు సూచించారు. అమలాపురంలోని కార్యాలయంలో ఎస్పీ జిల్లా నేర సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు, మహిళలు కనిపించడం లేదని ఫిర్యాదు చేస్తే, కేసును సకాలంలో ఛేదించి వారిని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించాలన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించి నమోదైన కేసులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కేసుల పురోగతి నివేదిక ఇవ్వాలని కోరారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

సహకార సంఘాలకు 'పన్ను'పోటు

- న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు, క్రయవిక్రయాలు తదితరాలపై ఆదాయపన్ను శాఖ నుంచి తాఖీదులు రావడంతో సంఘాలు కంగుతింటున్నాయి. ఇప్పుడిప్పుడే ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోలులో తోడ్పాటు అందిస్తూ ఆదాయం సమకూర్చుకుంటున్న సమయంలో ఆదాయపన్ను శాఖ చర్యలు సంఘాల మనుగడపై ప్రభావం చూపుతాయని ఆ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, వ్యాపార లావాదేవీలపై జీఎస్టీ చెల్లించాలని పేర్కొనడంతో సంఘాల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 166 సహకార సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటిలో సగానికిపైగా నోటీసులు వచ్చినట్లు సమాచారం. గతంలో సంఘాలు కేవలం పంట రుణాలు తదితరాలకు పరిమితం కావడం, బినామీ పేర్లతో చాలామంది రుణాలు తీసుకోవడంతో నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికీ జిల్లాలో కొన్ని నామమాత్రంగానే నడుస్తున్నాయి. ఇంకొన్నిట్లో ఎరువులు విక్రయించడం, పెట్రోలు బంకుల నిర్వహణ, జన్ ఔషధి పేరుతో మందుల అమ్మకాలు చేసి ఆదాయం పెంచుకుని నిలదొక్కుకుంటున్నాయి. మరికొన్ని నేరుగా స్థానికులు, రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతుల నుంచి సేకరిస్తున్న డిపాజిట్లు, రుణాలపై వసూలు చేస్తున్న వడ్డీపై పన్ను చెల్లించాలని ఆదాయపన్ను శాఖ నుంచి వస్తున్న నోటీసులు చర్చనీయాంశంగా మారాయి.



దేవగుప్తం సహకార సంఘం

జీఎస్టీ పరిధిలోకి..

వాణిజ్య పన్నులశాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉండేది. అప్పుడు సహకార సంఘాలకు సంబంధించి ఏ విధమైన పన్నులు వసూలు చేసేవారు కాదు. 2017 జులై 1 నుంచి వాణిజ్య పన్నులశాఖ పరిధిలోని పన్నుల వసూళ్లు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 18 శాతం జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో ఈ సంఘాలకు ఆదాయ, వ్యయాల లెక్కలు చూపేవారు కాదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరాలవారీగా ఆదాయ, వ్యయ వివరాలు తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ నోటీసులు రావడంతో చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుని లెక్కలు అప్పజెప్పే పనిలోపడ్డారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలోనే..

గతంలో సహకార సంఘాలకు సంబంధించి ఖర్చులపై ప్రభుత్వ ఆడిటర్లే పరిశీలించి నివేదికలు అందించేవారు. రెండేళ్లుగా మాత్రమే బయటి ఆడిటర్లతో జమాఖర్చుల నివేదిక తయారు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఆదాయపన్ను చెల్లింపులపై ఇప్పటివరకు ఏ ఒక్క సంఘానికి అవగాహన కల్పించలేదు. ఇప్పటికిప్పుడు పన్నులు చెల్లించాలని నోటీలు ఇవ్వడంపై పలు సంఘాల ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పన్ను నుంచి మినహాయింపు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బదులు ఇస్తున్నాం

జిల్లాలోని 166 సంఘాల్లో కొన్నింటికి ఆదాయపన్ను శాఖ నుంచి నోటీసులు వస్తున్నాయి. ఆడిటర్ల ద్వారా బదులు ఇవ్వాలని సూచించాం. ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు వస్తున్న నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సర లావాదేవీలకు సంబంధించి వివరాలు నమోదు చేయిస్తున్నాం.

- రాధాకృష్ణ, సహకార శాఖ జిల్లా అధికారి

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: జిల్లాలో పడకేసిన పర్యాటకరంగ అభివృద్ధికి ఊతమిచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం తీరంలో రూ.2 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కలెక్టరు మహేష్ కుమార్, ఆర్డీవో కేశవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, స్థానిక సర్పంచి జోగి రాజేశ్వరి, అరిగెల నానాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, పళ్ళ చోళ్ల పద్మనాభం, మేకల నానాజీ, సత్తి చిన్న, కోటిపల్లి రాజు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్.యానాం బీచ్‌లో భూమిపూజ చేస్తున్న ఆనందరావు తదితరులు

చిన్నతరహా పరిశ్రమల స్థాపనపై దృష్టి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో కొబ్బరి, ఆక్వా, ఉద్యాన పంట ఉత్పత్తుల పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సంబంధించిన అవకాశాలు అన్వేషించి చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉపాధి కల్పించేవాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పారిశ్రామికీకరణ విధానాలను అధికారులకు వివరించారు. ఇదే తరహాలో ఏర్పాటుకు జిల్లాలో అనుకూల పరిస్థితులపై అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలో చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు పైలట్ ప్రాజెక్టుగా అల్లూరి, అంబేడ్కర్ కోనసీమ, చిత్తూరు జిల్లాలను ఎంపిక చేశారన్నారు. జిల్లాకు వచ్చే అధ్యయన బృందానికి అధికారులు తమ సహాయసహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఎల్‌డీఎం కేశవవర్మ, జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్

నాణ్యమైన సరకులు సరఫరా చేయాల్సిందే..

అల్లవరం: గురుకులాలకు నిత్యావసరాలు, కూరగాయలు, కోడిగుడ్లు, పండ్లు, మాంసం ఉత్పత్తుల సరఫరాదారులు నాణ్యమైనవి అందించకపోతే వారిపై చర్యలు తప్పవని జేసీ నిశాంతి హెచ్చరించారు. శుక్రవారం ఆమె గోడి గురుకుల బాలుర పాఠశాలలో తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న భోజనంలో నాణ్యత ఉండటం లేదని పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తరగతిగదులు, వసతిగృహం, భోజనశాలలో సౌకర్యాలను పరిశీలించారు.

అధికారులపై ఆగ్రహం: సరకుల సరఫరాదారులు పాఠశాలకు రావాలని సూచించినా వారు హాజరుకాకపోవడంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుత్తేదారులు జిల్లా స్థాయి అధికారి మాటకు విలువ ఇవ్వకపోతే నాణ్యమైన సరకులెలా సరఫరా అవుతాయని ప్రశ్నించారు. తక్షణం వారందరికీ నోటీసులిచ్చి సమాధానం తీసుకోవాలని, కారణాలు సహేతుకంగా లేకపోతే వారి స్థానంలో కొత్తవారికి పనులు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో రాజీపడే ప్రసక్తేలేదన్నారు. తరగతి గదుల్లోని ఐఎఫ్‌పీ ప్యానళ్లలో పాఠ్యాంశాలకు సంబంధించిన వివరాలు లేకుండా సినిమా పాటలు ఉండడంపై ఆమె అవాక్కయ్యారు. సరైన రీతిలో వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు ఎలక్ట్రీషియన్ కావాలని అడుగగా మండల తెదేపా అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు తన డబ్బులతో ఏర్పాటు చేయిస్తానని జేసీకి తెలిపారు. వెంట డీసీవో వెంకట్రావు, తహసీల్దారు నరసింహారావు, ఇతర అధికారులు ఉన్నారు.



భోజనాల నాణ్యత పరిశీలిస్తున్న జేసీ నిశాంతి



మాట్లాడుతున్న ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు

మందులకైనా డబ్బులు ఇప్పించండి

జయలక్ష్మి సొసైటీ మహాజన సభలో బాధితుల ఆవేదన

గాంధీనగర్, సర్పవరం జంక్షన్: కనీసం మందులు కొనుక్కునేందుకైనా డబ్బులు ఇప్పించాలని ఒకరు.. కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు పోయాయి. అప్పు చేసి వివాహం చేశాం.. వాటికి వడ్డీ చెల్లించేందుకైనా కొంత సొమ్ము వచ్చేలా చూడాలని మరొకరు.. ఇలా ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభలో సభ్యుల ఆవేదనలు మిన్నంటాయి. సొసైటీ మహజన సభ శుక్రవారం దంటు కాన్ఫరెన్సు హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మానాలు ప్రవేశపెట్టిన సమయంలో పలువురు సభ్యులు వాటిని అభ్యంతరం వ్యక్తంచేసి ప్రయత్నం చేశారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం సొసైటీ తరఫున ప్రభుత్వం, కోర్టు, దుబ్బాగోడలపై జరిపే లావాదేవీలన్నీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు తీర్మానంలో ఆమోదం చెబుతూ వారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ రూ.500 కోట్లు రుణాలు తీసుకుని చెల్లించని వారి ఆస్తులను సీబీసీఐడీ జప్తు చేసిందన్నారు. కోర్టు నుంచి సేల్ ఆర్డర్ వచ్చిన తర్వాత వాటిని విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. మొత్తం రూ.700 కోట్ల స్కాం జరిగిందన్నారు. సొసైటీకి తనఖా పెట్టిన ఆస్తుల విలువ రూ.497 కోట్ల వరకు ఉంటుందన్నారు. సుమారు రూ.1000 కోట్ల వరకు రావాల్సి వస్తుందని, వేసుల్లో బాధితులెవ్వరూ ఆధైర్యం పడవద్దన్నారు. డిసెంబరు నాటికి రూ.50 కోట్లు బాధితులకు అందజేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 70 మంది బాధితులు మృతి చెందారన్నారు. ఈ స్కాం విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలిసి వివరించామన్నారు. ప్రభుత్వం నుంచి సొసైటీకి రూ.200 కోట్ల రుణం ఇప్పించాలని కోరామన్నారు. తమ పాలకవర్గంపై కొందరు సభ్యులు మిథ్య ప్రచారం చేస్తున్నారన్నారు. సూరావే శంలో వైస్ఛైర్మన్ ఉమ్మడి గోదా వరి జిల్లాలు, విశాఖపట్నానికి చెందిన సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధితో వసతుల కల్పన

పథకానికి ఊతమిచ్చిన కూటమి ప్రభుత్వం

న్యూస్‌టుడే - రావులపాలెం గ్రామీణం, కొత్తపేట, ఆలమూరు



పనులు చేస్తున్న ఉపాధి కూలీలు



పథకంలో సాగు చేస్తున్న కొబ్బరి మొక్కలు

కేవలం కూలీలకు ఉపాధి కల్పించేందుకు మాత్రమే ఉపయోగపడిన ఉపాధి హామీ పథకాన్ని.. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు, రైతులకు అండగా ఉండేలా కూటమి ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చింది. జిల్లాలో 22 మండలాల్లోని 380 గ్రామాల్లో ఆగస్టు 23న ఒకేసారి రికార్డు స్థాయిలో ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులను గుర్తించడంతోపాటు గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రెయిన్లు, పాడి రైతులకు పశువుల షెడ్లు, కోళ్ల, మేకల ఫారాలు, ఉద్యాన రైతులకు పెట్టుబడి సాయం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 45.29 లక్షల పనిదినాలను పూర్తిచేయగా, కూలీలకు వేతనాలు రూ.132 కోట్లు జమ చేశారు. సామగ్రి రూపంలో రూ.21 కోట్లు విడుదల చేశారు. గ్రామాల్లో మొత్తం 352 సీసీ రోడ్లు నిర్మించేందుకు పంచాయతీలు ప్రతిపాదనలు పంపాయి. పశువుల పెంపకం నిమిత్తం 1,799 షెడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. 163 పనులు చేపట్టనుండగా, 122 పనులకు పరిపాలనామోదం రావాల్సి ఉంది. ఇప్పటివరకు జిల్లాలో 101 ఎకరాల్లో ఉద్యాన సాగు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. రైతులకు మూడేళ్లపాటు సాయం అందించనున్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను గుర్తించి పెట్టుబడి సాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించేందుకు అనుమతులు ఇస్తున్నాం. ఇప్పటివరకు 96 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చాయి. రైతులకు మినీ గోకులాల షెడ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలి.

- మధుసూదన్, పీడీ, డ్వామా

పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ రవాణా, సంస్కృతి, పర్యాటక శాఖల పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝా ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో జరి సభలకు చెందిన 31 మంది ఎంపీలు ఉండగా లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ప్రాతినిధ్యం వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి చోటు దక్కించుకున్న ఏకైక ఎంపీ కావడం విశేషం. ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక పార్లమెంటరీ కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ సూచనలతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి




భక్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో అక్టోబరు 21 నుంచి 29 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. శుక్రవారం ఆయన ఆలయ పడమర వైపు మాడ వీధి నుంచి స్వామివారి పార్కింగ్ ప్రదేశం వరకు రూ.45 లక్షలతో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవస్థానం పరిపాలన భవనంలో డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర రావు అధ్యక్షతన సిబ్బంది, అర్చకులు తదితరులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. బ్రహ్మోత్సవాలకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వివిధ జాతీయ బ్యాంకుల వారు దేవస్థానానికి ఉచిత బస్సులు సమకూర్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం శుభపరిణామమన్నారు. కాలినడకన ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా గోదావరి ఏటిగట్లను రూ.35 కోట్లతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు.

ఏఎంసీ కమిషనర్ ప్రత్యేక పూజలు

కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామివారిని రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ కమిషనర్, రైతు బజార్ల సీఈవో విజయసునీత శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అణువు సమర్థ వినియోగంతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: అణువును సమర్థవంతంగా వినియోగించుకోవడంతోనే దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని విశాఖ బాబా ఆటమిక్ రీసెర్చి సెంటర్ (బార్క్) శాస్త్రవేత్త ఎంవీ సూర్యనారాయణ అన్నారు. ఆరోగ్య రక్షణ, పర్యావరణంలో అణుశాస్త్ర విజ్ఞానం అనే అంశంపై శుక్రవారం ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సు జరిగింది. కళాశాల భౌతిక, రసాయన, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో బార్క్ సౌజన్యంతో ఏర్పాటైన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అణువు ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ జపాన్ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మారిందన్నారు. వ్యవసాయ రంగంలో అధిక ఉత్పత్తులు సాధించడం, ఔషధాల తయారీలో న్యూక్లియర్ విజ్ఞానం ముఖ్య భూమిక వహిస్తుందన్నారు. ప్రపంచాన్ని వణికిస్తున్న క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంలో న్యూక్లియర్ సైన్స్‌దే కీలక పాత్ర అన్నారు. శాస్త్రవేత్తలు రాఘవేంద్ర, జగన్నాథరాజు, గౌరీ శంకర్ మాట్లాడుతూ.. న్యూక్లియర్ సైన్స్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డి.సునీత, ఎన్ఎస్ఎస్ పీవో ప్రగడ ప్రయోగమూర్తి మాట్లాడుతూ.. సదస్సును ఇక్కడ ఏర్పాటుచేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డి.చెన్నారావు, అధ్యాపకుడు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని దిశానిర్దేశం చేశారు.

కార్యకర్త పాడె మోసిన మంత్రి సుభాష్

అంబాజీపేట, న్యూస్‌టుడే: మాచవరానికి చెందిన తెదేపా కార్యకర్త గుత్తుల శ్రీను (ఎర్ర శ్రీను) (42) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఎన్నికల సమయంలో తన విజయానికి కృషి చేసిన కార్యకర్త మృతి చెందిన సమాచారంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాచవరం చేరుకుని రామ్‌ఘాట్ క్షేత్రంలోని శ్మశానవాటిక వరకు పాడె మోశారు. శ్రీను భార్య, ఇద్దరు కుమారులను పరామర్శించారు. మంత్రితో పాటు ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్యమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాడెను మోస్తున్న కార్మికశాఖ మంత్రి సుభాష్

నాణ్యమైన కూరగాయలు అందించాలి

రావులపాలెం పట్టణం, అంబాజీపేట, న్యూస్‌టుడే: రైతు బజార్ వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలని రైతు బజార్‌ల ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయ సునీత అన్నారు. రావులపాలెం రైతు బజార్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. విక్రయిస్తున్న కూరగాయలను పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంబాజీపేట వ్యవసాయ మార్కెట్‌ను పరిశీలించి అక్కడి పరిస్థితులు, రైతుల విక్రయాలు, వ్యాపారులు కొనుగోళ్లపై ఆరా తీశారు. జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ లావణ్య, మార్కెటింగ్ అధికారి విశాలాక్షి, కార్యదర్శి రమేష్, ఎస్టేట్ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెం రైతుబజార్‌లో రైతుతో మాట్లాడుతున్న విజయసునీత

విద్యలో మంచి ఫలితాలు సాధించాలి: డీఈవో

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: పాఠశాల, ఇంటర్ విద్యలో ఉపాధ్యాయుల సూచనలు పాటించి మంచి ఫలితాలు సాధించాలని డీఈవో కమలకుమారి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం రామేశ్వరంలోని జడ్పీ పాఠశాల, ఇంటర్ కళాశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల సూచనలతో ప్రణాళికబద్ధంగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం వడ్డించాలని ఉపాధ్యాయులు, నిర్వాహకులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సెక్టోరియల్ జిల్లా అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవో-1, 2, కిషోర్‌కుమార్, వెంకటేశ్వరరావు, మలికిపురం ఎంఈవో జయ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

వైకాపా జిల్లా అధ్యక్షుడిగా విశ్వరూప్



అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి పినిపే విశ్వరూప్‌ను నియమించినట్లు ఆ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు అమలాపురం, జిల్లా పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

రైతుల ప్రతిఘటనతో వెనుదిరిగిన అధికారులు



పోలీసులతో రైతుల వాగ్వాదం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులను తొలగించాలని ఇటీవల ఎన్జీటీ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. అనుమతుల్లేని రొయ్యల చెరువులకు విద్యుత్తు కనెక్షను తొలగించాలని జిల్లా కలెక్టరు ఆదేశాలతో అంతర్వేది సముద్ర తీరంలో ఉన్న ఆక్వా చెరువుల వద్దకు ఏఈ శ్రీనివాసు, రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు దుర్గాశ్రీనివాస్, అయినవిల్లి ఎస్సై జోషి, 30 మంది పోలీసులు, ఎఫ్‌డీవో రమణ, రెవెన్యూ సిబ్బంది చేరుకున్నారు. ఆక్వా రైతులు వచ్చి తాము వీటిపైనే ఆధారపడి జీవిస్తున్నామని, చౌడు భూములు ఆక్వా చెరువులకు తప్ప ఎందుకు ఉపయోగపడతాయని ప్రశ్నించారు. తమకు ఉపాధి చూపకుండా తొలగిస్తే పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. రైతులతో చర్చించిన అనంతరం ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పి అధికారులు వెనుదిరిగారు. అనంతరం రైతులంతా సమావేశమై కలెక్టర్ వద్దకు వెళ్లి విన్నవించాలని నిర్ణయించుకున్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥ల్లో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,500
పాతకాయ: గండేరా	18,000
గటగట	15,000
కొత్తకాయ: గండేరా	17,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	17,000-18,000
కొత్త (పచ్చి) కాయ	17,000-17,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,375
కిలో	225

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	121-00
రిటైల్ లైవ్	143-00
డ్రెస్డ్	207-00
స్కిన్‌లెస్	236-00

వృద్ధురాలిపై అత్యాచారం కేసులో నిందితుడికి పదకొండేళ్ల జైలు

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరంలో 85 సంవత్సరాల వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజమహేంద్రవరం ఎనిమిదో న్యాయస్థానం మరియు క్రైమ్ అగైనెస్ట్ విమెన్ కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు. మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గత ఏడాది ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 5 గంటల ప్రాంతంలో 85 ఏళ్ల వృద్ధురాలిపై లారీ క్లీనర్‌గా పని చేస్తున్న కరప మండలం వేళంగికి చెందిన నొక్కు వెంకటరమణ అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. వృద్ధురాలి అరుపులకు సమీప ఇంటి యజమాని, అతని భార్య అక్కడకు చేరుకొని నిందితుడిని పట్టుకొని రాయవరం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారన్నారు. అప్పటి ఎస్సై పీవీఎస్ఎస్ఎన్ సురేష్ కేసు నమోదు చేయగా, సీఐ గౌరీశంకర్ దర్యాప్తు చేశారన్నారు. రాజమహేంద్రవరం ఎనిమిదో న్యాయస్థానం మరియు క్రైమ్ అగైనెస్ట్ విమెన్ కోర్టులో వాదోపవాదనల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు వెంకటరమణకు పది సంవత్సరాలు కఠిన కారాగారం, ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.అయిదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బి.బెన్నయ్యనాయుడు తీర్పు ఇచ్చారన్నారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్సైలు పీవీఎస్ఎస్ఎన్ సురేష్, బుజ్జిబాబు, అప్పటి సీఐలు గౌరీశంకర్, పి.శివగణేష్, ఏఎస్సై, సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించినట్లు సీఐ తెలిపారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

గ్రామాల శుభ్రతలో కార్మికులదే బాధ్యత



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న సర్పంచి రాంబాబు

ఆలమూరు: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత కీలకమైనదని గుమ్మిలేరు సర్పంచి గుణ్ణం రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. ప్రజలంతా ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భగవన్నామ సంకీర్తన యజ్ఞంతో జీవన్ముక్తి

ఆలమూరు న్యూస్‌టుడే: భగవన్నామ సంకీర్తనతో జీవన్ముక్తి సాధ్యమవుతుందని ఆలమూరు అయ్యప్ప స్వామి ఆలయ నిర్వాహకులు ముకుంద స్వామి అన్నారు. శుక్రవారం హరి నామాన్ని జపిస్తూ కొందరు భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. వారం రోజులుగా బ్రహ్మజ్ఞానేశ్వరి పీఠంలో జరుగుతున్న శ్రీపురందరదాసు సంకీర్తన సప్తాహం శుక్రవారంతో ముగిశాయి.



గ్రామోత్సవంలో భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు వందనం

వీధి దీపాలు ఏర్పాటు

బొబ్బర్లంకలో వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి నరాలశెట్టి సుబ్బలక్ష్మి, కార్యదర్శి హనుమల వద్ద ప్రస్తావించగా స్పందించారు. సిబ్బందిని పంపి వీధి దీపాలు వేయించారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

డ్రెయినేజీ శుభ్రం

స్థానిక శ్రీనివాస్‌నగర్‌లో డ్రెయినేజీ పూడిక పోవడంతో మురుగునీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, రావులపాలెం పట్టణం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

అక్రమ ఆక్వా చెరువులపై చర్యలకు సిద్ధం

తొలుత విద్యుత్తు సరఫరా నిలుపుదల

న్యూస్‌టుడే, మామిడికుదురు

ఆక్వా చెరువుల అక్రమ సాగుతో పర్యావరణ, జల కలుషిత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సముద్ర, నదీ తీరాలను ఆనుకుని ఉన్న ఉప్పునీటి చెరువులతో అనర్థాలు ఎదురవుతున్నాయి. తీరానికి రక్షణగా ఉన్న ఏటిగట్టు చెంతనే యథేచ్ఛగా సాగు చేస్తుండటంతో సమీప ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇష్టానుసారం బోర్లు వేసి నీటిని మళ్లించడం, వ్యర్థాలను కాలువల్లోకి వదలడంతో పంట చేలు, కొబ్బరి తోటలు నిస్సారంగా మారుతున్నాయని రైతుల నుంచి ఆందోళన రేగుతోంది. అనుమతిలేని చెరువుల్లో సాగును అడ్డుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తీరప్రాంత గ్రామాల్లో ఆందోళన..

రాజోలు నియోజకవర్గంలో కరవాక నుంచి అంతర్వేది వరకు విస్తరించిన సముద్ర తీరం వెంబడి సీఆర్‌జడ్ పరిధిలో అనుమతులు లేకుండా ఉప్పునీటి చెరువులను తవ్వి ఏళ్లకాలంగా సాగు చేస్తుండటంతో పర్యావరణ సమస్యలు తలెత్తాయి. ఈ మండలాల్లోని 12 గ్రామాల్లో సముద్ర తీరానికి 200 మీటర్ల మేర 313.2 ఎకరాల్లో 187 చెరువులు, 500 మీటర్ల దూరంలో 353.89 ఎకరాల్లో 255 చెరువులున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిని సత్వరమే తొలగించాలని ఇప్పటికే ఎన్జీటీ నుంచి ఆదేశాలు వచ్చాయి. సీఆర్‌జడ్ పరిధిలో అక్రమంగా సాగు చేస్తున్న ఆక్వా చెరువులను తొలగించాలని, ఎన్జీటీ ఆదేశాలను అమలు చేయాలంటూ తీర గ్రామాల్లో ప్రజలు ఆందోళన చేస్తున్నారు. చెరువులు తొలగించాలంటూ గతంలో అధికారులు నోటీసులు ఇవ్వగా, ఇప్పుడు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేసేందుకు సిద్ధమయ్యారు. చెరువుల్లో సాగు పూర్తయ్యే వరకు సరఫరా నిలుపుదలకు కొంత గడువు ఇస్తున్నారు. నదీతీరంలోనూ నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా సాగు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి, కొబ్బరి, తదితర పంట భూములను నిస్సారం చేస్తూ, ఏటిగట్టుకు ప్రమాదకరంగా ఉన్న చెరువుల సాగుపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవిస్తున్నారు.



గోగన్నమఠంలో అనధికారికంగా సాగవుతున్న ఆక్వా చెరువులు

సముద్ర తీరంలో 500 మీటర్ల సీఆర్‌జడ్ పరిధిలోకి వచ్చిన అనధికారిక చెరువులకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

మండలం	గ్రామాలు	రైతులు	చెరువులు	ఎకరాలు
మామిడికుదురు	2	101	214	385.31
సఖినేటిపల్లి	4	161	191	249.59
మలికిపురం	6	30	37	32.19
మొత్తం	12	292	442	667.09

అనధికార చెరువులను తొలగిస్తాం..

రాజోలు నియోజకవర్గంలోని సముద్ర తీరంలో అనధికారికంగా సాగవుతున్న సీఆర్‌జడ్ పరిధిలోని చెరువులను ఇప్పటికే గుర్తించాం. వాటికి సంబంధించి విద్యుత్తు సరఫరా నిలుపుదలకు చర్యలు చేపట్టాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రస్తుతం సాగులో ఉన్న చెరువుల యజమానులకు కొంత గడువు ఇస్తున్నాం. అనధికారిక చెరువులను పూర్తిగా తొలగించేందుకు తదుపరి చర్యలు చేపడతాం.

- ఎల్‌బీఎస్ వర్ధన్, ఏడీ, మత్స్యశాఖ, రాజోలు

వరద బాధితులకు సహాయం

కొత్తపేట, న్యూస్‌టుడే: వాడపాలెం గ్రామానికి చెందిన జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు బండారు నరసింహమూర్తి, సాధనాల శివాజీ శుక్రవారం అమరావతి కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలుసుకుని వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష విరాళం చెక్కును అందజేశారు.

ఆదుర్రుకు ఆర్టీసీ బస్సు ప్రారంభం

మామిడికుదురు: ఆదుర్రుకు ఏళ్లకాలం తర్వాత స్థానికుల వినతుల మేరకు అమలాపురం డిపో నుంచి ఆర్టీసీ బస్సు సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. ఆదుర్రు నుంచి లూటుకుర్రు మీదుగా బస్సు సర్వీసును ఏర్పాటు చేసినందుకు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచులు బళ్ల శ్రీనివాసరావు, అడబాల తాతకాపు, కూటమి నాయకులు, స్థానికులు పలువురు బస్సులో మామిడికుదురు వరకు ప్రయాణించారు.

అంబాజీపేట సొసైటీ మహాజన సభ నేడు

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట సొసైటీ మహాజన సభ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు తెలిపారు. సభకు సభ్యులు, రైతులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ప్రసాదం కల్తీలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీకి పాల్పడిన గత వైకాపా పాలకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మొగలికుదురు, జగ్గన్నపేట, తాటిపాక గ్రామాలకు చెందిన పలువురు భక్తులు శుక్రవారం జగ్గన్నపేట నుంచి పాదయాత్రగా అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రసాదం అపవిత్రం అయినందుకు మన్నించాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో పోతు కాశీ, సూదా మోహన్, పెచ్చెట్టి అర్జున్, సుంకర నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం సీఐగా శేఖర్‌బాబు



రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం సీఐగా శేఖర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరపల్లి ఇన్‌ఛార్జి సీఐగా పనిచేసి ఇక్కడికి వచ్చారు. ఇక్కడి సీఐ జేమ్స్‌రత్నప్రసాద్ సీఐడీకి బదిలీపై వెళ్లారు.

సుస్థిర పాలనకు నిదర్శనం కూటమి ప్రభుత్వం

కొత్తపేట: దేశంలో వ్యవస్థలన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం సుస్థిర పాలనకు నిదర్శనమని స్థానిక విశ్వకవి వేమన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.పి.రాజు అన్నారు. విజన్ 2047లో భాగంగా సుస్థిర ప్రభుత్వం, డిజిటల్ పరిపాలనపై శుక్రవారం నిర్వహించిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, నాగదీపిక, భవాని, సత్యానారాయణ, సుకృదవల్లి, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంలోనూ నిరాహార దీక్ష

మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం గత 17 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం వర్షంలోనూ నిరసన తెలిపారు. తమకు జీతాలు చెల్లించి ఆదుకోవాలని నినాదాలు చేశారు. గెద్దం పేర్రాజు, పిండి సత్యనారాయణ, నల్లి శివ, సీహెచ్ సూర్యప్రకాశరావు, నల్లి మోహనరావు తదితరులు ఆందోళన శిబిరాన్ని సందర్శించి అధ్యాపకులకు మద్దతు పలికారు.

మేలైన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

మామిడికుదురు: వరి సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు మేలైన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ రామ్మోహన రావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఈదరాడలో శుక్రవారం జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం వరి పంటను ఆశించిన ఆకు ముడత తెగులు లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. ఏవో మృదుల, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



ఈదరాడలో చేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

భారీవర్షంతో ప్రయాణికుల ఇక్కట్లు

కొత్తపేట: శుక్రవారం కురిసిన భారీ వర్షంతో బిళ్లకుర్రు, అవిడి, వాసపల్లి, కొత్తపేట రహదార్లలోని గుంతల్లో నీరుచేరి వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కొత్తపేట గణేష్‌కాలనీ, కొప్పిశెట్టివారి వీధుల్లో నీరు నిలిచిపోయింది. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

మలికిపురం: స్థానిక పద్మజ సినిమా హాలు కూడలి, కేశనపల్లి నాగన్నగారిపాలెం, మట్టపర్రు, శంకరగుప్తం-బట్టేలంక ర.భ.రహదారి, గుడిమెళ్లంక-రామరాజులంక, విశ్వేశ్వరాయపురం-లక్కవరం రహదారులు ముంపునకు గురయ్యాయి.



మలికిపురం పద్మజ సినిమా హాలు కూడలిలో...

ఇదేం మైదానం... ఇవేం ఆటలు...

పి.గన్నవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి కురిసిన వర్షానికి మైదానం చిత్తడిగా, బురదగా తయారైంది. వాలీబాల్ కోర్టులో నీరు నిలిచిపోయింది. అయినప్పటికీ నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోకుండా ఆ కోర్టులోనే పోటీలు జరిపించారు. మైదానంలో క్రీడాకారులు జారిపడితే ఎవరు బాధ్యత వహిస్తారని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు మండలాల ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు వర్షంతో ఇబ్బంది పడ్డారు.

- న్యూస్‌టుడే, పి.గన్నవరం



అందుబాటులోకి రాని ఆసుపత్రి భవనం

అంబాజీపేట మండలం పసుపల్లిలో వైఎస్ఆర్ క్లినిక్ భవన నిర్మాణానికి 2021 డిసెంబరు 7న అప్పటి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమిపూజ చేశారు. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్ఆర్ క్లినిక్ భవనాల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ. 79.25 లక్షలు సమకూర్చారు. ఏళ్లు గడుస్తున్నా ఆసుపత్రి భవనం అందుబాటులోకి రాలేదు. దీనిపై మండల ఇన్‌ఛార్జి ఇంజినీరింగ్ అధికారి కృష్ణంరాజు మాట్లాడుతూ నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయిందన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన తదుపరి పనులు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, అంబాజీపేట



నిర్మాణం నిలిచిపోయిన ఆరోగ్య కేంద్ర భవనం

సామరస్యంగా రహదారి పనులు పూర్తిచేయాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారి, బైపాస్ నిర్మాణంలో స్థానిక సమస్యలపై రైతులతో చర్చించి సామరస్యంగా పరిష్కారం చూపుతూ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ రెవెన్యూ, ఎన్.హెచ్. అధికారులకు సూచించారు. పాశర్లపూడి పరిధిలో పనులు నిలిచిపోయిన చోట్ల శుక్రవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పాశర్లపూడి, కొండాలమ్మచింత, నైకాలపేటలో రహదారి పరిధిలోకి వచ్చే స్థలాలను పరిశీలించారు. రహదారి అభివృద్ధి పనులకు సహకరించాలని రైతులు, స్థానికులకు సూచించారు. సంయుక్త కలెక్టర్ నిశాంతి, తహసీల్దారు బి.మృత్యుంజయరావు, ఎన్‌హెచ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జాతీయ రహదారి పనులపై వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలి

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: పర్యావరణానికి విఘాతం కలిగించే అక్రమ రొయ్యల చెరువులను వెంటనే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు, రాజోలు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం అంతర్వేదిలో జంపన ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సముద్ర తీరంలో అక్రమ చెరువుల వల్ల నీరు, గాలి, భూమి కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ భూముల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేశవశెట్టి, తాతారావు, ప్రభాకర్‌రావు, మనోహర్, నానాజీ, వెంకట్ పాల్గొన్నారు.

సహకార సంఘాలను ప్రక్షాళన చేయాలి

రాజోలు, న్యూస్‌టుడే: గాడి తప్పిన సహకార సంఘాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా సహకార అధికారులు, సొసైటీ సీఈవోలతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొన్ని సొసైటీల్లో ఉద్యోగులు 40 ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్నారని, దీని వల్ల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. నియోజకవర్గంలోని 26 సహకార సంఘాల్లో రైతులకు ఇచ్చిన రూ. 200 కోట్ల రుణాల బకాయిలు వసూలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. లక్కవరం సొసైటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి బాధ్యుడి నుంచి నగదు, బంగారం రికవరీ చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో 36 మందిని వివిధ సొసైటీలలో ఉద్యోగులుగా నియమించి ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలు చొప్పున వసూలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. డివిజనల్ సహకార అధికారి రాధాకృష్ణారావు, డీసీసీబీ ఏజీఎం రమేష్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మంజు, డీసీసీబీ మేనేజర్లు, సీఈఓలు, గుండుబోగుల పెదకాపు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: నిర్మాణ రంగానికి అవసరమైన గోదావరి ఇసుక, తువ్వ ఇసుక విధానంలో ప్రభుత్వం సత్వరమే నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మలికిపురం, సఖినేటిపల్లి మండలాల తాపీ పనివారల సంఘం, అరుణోదయ పెయింటింగ్, నవోదయ ఎలక్ట్రికల్ వర్కర్స్, ట్రాక్టర్స్ అండ్ ట్రక్ యూనియన్, సెంటరింగ్, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇసుక కొరతతో ఉపాధి లేక పస్తులుండే పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. సముద్ర తీరంలో, పట్టా భూముల్లో తువ్వ ఇసుకపై మైనింగ్ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన సుమారు రూ.3 వేల కోట్లను గత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. కార్మికుల బీమా పథకాన్ని పునరుద్ధరించనున్నట్లు చెప్పారు.

దేవీ శరన్నవరాత్రుల కరపత్రాలు ఆవిష్కరణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట పశువుల సంతలో ఉన్న విజయకనకదుర్గమ్మ వారి శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆలయ అర్చకుడు కామేష్‌శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు.

గోవా ఫొటో ఎగ్జిబిషన్‌లో మలికిపురం ఫొటోగ్రాఫర్లు

మలికిపురం: యునైటెడ్ గోవన్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోవాలో ప్రారంభమైన గోవా ఫొటో ఎగ్జిబిషనులో మలికిపురం, సఖినేటిపల్లి మండలాల నుంచి రాష్ట్ర ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సీవీ రావు, డి.కేశవ, జి.అజయ్, కె.విజయరత్నం, తుని చిన్నిలోవరాజు పాల్గొన్నారు. ఫొటోగ్రఫీలో మెలకువలు నేర్పారని సీవీ రావు చెప్పారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల ఆందోళన

అంబాజీపేట, న్యూస్‌టుడే: బకాయి, సమ్మెకాలంలో జీతాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం భోజన విరామ సమయంలో నందంపూడి ప్రాథమిక పాఠశాల వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు.

ఆత్రేయపురం: విద్యాశాఖలో విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, పొరుగు సేవల ఉద్యోగులు శుక్రవారం ఆత్రేయపురం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దసరాకు కూడా సకాలంలో జీతాలు అందించకపోతే తమకు ఇబ్బందులు తప్పవన్నారు. కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీబీఐ విచారణ చేయించాలి

మామిడికుదురు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీపై సీబీఐతో విచారణ చేయించాలని కోరుతూ వైకాపా మండల పార్టీ ఆధ్వర్యంలో మామిడికుదురులోని 216 జాతీయ రహదారి కూడలిలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

పి.గన్నవరం: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను పి.గన్నవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు.

మెరుగైన విద్యుత్తు సరఫరాకు కృషి

మలికిపురం, న్యూస్‌టుడే: మెరుగైన విద్యుత్తు సరఫరాకు కృషి చేస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు తెలిపారు. శుక్రవారం లక్కవరం విద్యుత్తు ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించి, కాలిపోయిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన పరిశీలించారు. కొత్తది ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమున్న చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, తీగలు వేలాడకుండా అదనపు స్తంభాలు, కొత్త కండక్టర్లు వేయాలని లక్కవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు కోరారు. ఎస్ఈ రాజబాబును సన్మానించారు. ఈఈ ఎం.రవికుమార్, ఏడీఈ శ్రీనివాసరావు, స్థానిక ఇన్‌ఛార్జి ఏఈ బి.ప్రసాద్, నాయకులు కోట ఏసురత్నం, పలచోళ్ల రాంబాబు, శృంగారపు పద్మనాభం, సిద్దిరెడ్డి కాశీ పాల్గొన్నారు.



ఎస్ఈని సన్మానిస్తున్న గోపాలకృష్ణరాజు, నాయకులు

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం: ఎంపీ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ అన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో పి.గన్నవరం గ్రేస్ కళాశాలలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఉద్యోగ మేళాకు సుమారు 1,500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 20 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ముఖాముఖి నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్, జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.కె.వి.శ్రీనివాసరావు, ఎంపీపీ నాగలక్ష్మి, తెదేపా నేత నామన రాంబాబు, సర్పంచి నాగమణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే గిడ్డి

కూటమి ప్రభుత్వానికి ఎనలేని ఆదరణ

మామిడికుదురు: వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం సాధించిన సంక్షేమం, అభివృద్ధితో ప్రజల్లో ఆదరణ కనిపిస్తోందని స్థానిక నాయకులు తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మాకనపాలెంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు బోనం బాబు, చుట్టుగుల్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాకనపాలెంలో కరపత్రాలను అందజేస్తున్న కూటమి నాయకులు

ప్రసాదం కల్తీ దోషులను శిక్షించాలి

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ చేసిన వారిని శిక్షించాలని సఖినేటిపల్లిలంకలో హిందూ పరిరక్షణ సమితి సభ్యులు, స్థానికులు నిరసన తెలిపారు. సఖినేటిపల్లిలంక బోను రామాలయం నుంచి శివాలయం వరకు మూడు కిలోమీటర్లు కాగడాలతో పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేశారు.



హిందూ పరిరక్షణ సమితి, లంక వాసుల నిరసన

సాధనతో నైపుణ్యం.. విజయమే లక్ష్యం

జాతీయ స్థాయిలో రాణిస్తున్న బాలికలు

న్యూస్‌టుడే - రావులపాలెం గ్రామీణం, పట్టణం

రావులపాలెం మండలం ఈతకోట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు. ఇటీవల పాఠశాలలో జరిగిన నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఇప్పటివరకు ఝార్ఖండ్, గుంటూరు, ఆత్మకూరు, నర్సరావుపేట, నెల్లూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఆయా క్రీడల్లో సాధన చేస్తూ నైపుణ్యం పెంచుకుంటున్నారు.



నెట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నా తల్లిదండ్రులు కష్టపడి పనిచేస్తూ నన్ను చదివించడంతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సాహం అందించారు. ఝార్ఖండ్‌లో జాతీయ స్థాయిలో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. నర్సరావుపేటలో నిర్వహించిన జావెలిన్ త్రో రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాను.

- చింతపల్లి లక్ష్మీసాయిశ్రీ, ఈతకోట

నైపుణ్యం పెంచుకుంటున్నా...



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల పోటీల్లో పాల్గొంటున్నా. విజయవాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన అండర్-14 హ్యాండ్ బాల్ పోటీల్లో విజయం సాధించాను. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలనే లక్ష్యంతో నిత్యం సాధన చేస్తూ నైపుణ్యం పెంపొందించుకుంటున్నా.

- దేవరపల్లి కల్పన, ఈతకోట

మంచి భవిష్యత్తు..



విద్యార్థులు నిత్యం క్రీడా సాధనచేస్తూ వారిలో మెలకువలు నేర్చుకుంటూ మరింత మెరుగ్గా రాణించడం ద్వారా క్రీడల్లో కూడా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు. ఒక పక్క చదువుకుంటూనే మరో పక్క క్రీడల్లో కూడా సాధన చేస్తూ పోటీల్లో పాల్గొనడం ద్వారా తమలోని సత్తాను ప్రపంచానికి చాటిచెప్పవచ్చు.

- టేకి రామకృష్ణ, వ్యాయామోపాధ్యాయుడు

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అంబాజీపేట: కాకినాడలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఆటల పోటీల్లో అంబాజీపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆరుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం. కడలి సాయిరాం తెలిపారు. బాస్కెట్‌బాల్‌లో కె.ఎస్.వి.ప్రసాద్, జి.సిరిమల్లి, కె.లక్ష్మీప్రసన్న, నెట్‌బాల్‌లో నిమ్మకాయల చరిష్మాసాయిరుత్వి, కె.కీర్తన, తైక్వాండోలో పి.చరణ్యశ్రీ ప్రతిభ చూపారన్నారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆటలపోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం మరళీకృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. పరుగులో వైహానీ, హైజంప్‌లో ఎ.దివ్యతేజ, పరుగులో ఎ.నిహారిక, వి.సాహిని, కె.అమృతవర్షిణి, ఎల్.శ్రావ్య, ఎస్.షర్మిల ప్రతిభ చూపారు. క్రీడాకారులను, వ్యాయామోపాధ్యాయిని మంగాలక్ష్మిని పాఠశాల కరస్పాండెంటు, సెక్రటరీ పీఎస్‌రాజు అభినందించారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

ప్రాయశ్చిత్త పూజలు



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు

అల్లవరం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ అపవిత్రం నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మొగళ్లమూరు గణపతి ఆలయంలో శుక్రవారం ప్రాయశ్చిత్త పూజలు నిర్వహించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామంలో గోవింద నామస్మరణ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సర్పంచి రాయుడు విష్ణు, గూడాల పుల్లయ్యశెట్టి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ రామయ్య ఆలయంలో కలశాలతో భక్తులు

పంచ నదీ జలాలతో సంప్రోక్షణ

ముమ్మిడివరం: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో జరిగిన అపచారానికి ప్రాయశ్చిత్తంగా సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసీతా సమేత కల్యాణ రామస్వామి ఆలయంలో శుక్రవారం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమరత సేవా ఫౌండేషన్, ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో పంచ నదీ జలాలతో ఆలయాన్ని శుద్ధి చేశారు. ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ గొలకోటి సాయిబాబు, వెంకటేశ్వర్లు, గ్రంధి నానాజీ, కొయ్యల దుర్గారావు, సలాది శ్రీరామచంద్రమూర్తి, గాలిదేవర బుల్లి, మట్ట శివకుమార్, శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కామనగరువులో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇందుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 'హేమంత్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ వి.నరసింహారావు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు వి. శ్రీనివాసరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ మంగతాయారు, సర్పంచి శివాని, అప్పాజీ తదితరులు అభినందించారు. కామనగరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు వాలీబాల్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ జి. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు వి. చక్రధరరావు, యోగా శిక్షకుడు కె. నరేంద్ర, ఎస్ఎంసీ ఛైర్మన్ కె. సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యుడు శ్రీహరిరామ్ గోపాల్, ఎంపీపీ భాగ్యలక్ష్మి, సర్పంచి అరుణకుమారి అభినందించారు. కామనగరువు ఆదిత్య పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ బి. రామప్రసాద్, విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్. శృతిరెడ్డి, లక్ష్మీ సుధ తదితరులు అభినందించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న విద్యార్థులు

అమలాపురం కలెక్టరేట్: విజయవాడ వరద బాధితులకు పేరూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సేకరించిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అందజేశారు. వారు తమ పరిధిలోని ప్రాంతాల్లో సేకరించిన మొత్తం రూ.25,999లను చెక్కు రూపంలో కలెక్టర్‌కు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలపై స్పందించడాన్ని కొనియాడారు. విద్యాశాఖ అధికారి సూర్యప్రకాశం, నాగిరెడ్డి శివప్రసాద్ పాల్గొన్నారు.

అలా నమోదు.. ఇలా సాయం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

రెండు నెలలుగా జిల్లాలో కురిసిన అధిక వర్షాలతో ముంపు బారినపడి ఖరీఫ్ వరి చేలు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాల్లో రైతులు ఆదిలోనే పంట నష్టపోయామని ఆవేదన చెందారు. పంట దక్కుతుందన్న ఆశతో రెండుసార్లు నాట్లు వేసిన రైతుల వేదన వర్ణనాతీతం. వీరంతా అప్పుచేసి పెట్టుబడి పెట్టి పంట నష్టపోయారు. రైతుల పరిస్థితికి స్పందించిన కూటమి ప్రభుత్వం నష్టం వివరాలు నమోదుచేసిన పది రోజుల పూర్తి కాకుండానే రైతుల ఖాతాలకు సొమ్ము జమచేస్తుండడంతో వారంతో ఉద్వేగానికి గురవుతూ.. హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చాలా రోజుల తరువాత.. అదీ ఎకరాకు రూ.6,800 అందిస్తే కూటమి ప్రభుత్వం రూ.10 వేల చొప్పున పెట్టుబడి రాయితీని జమ చేసింది. దీంతో

పెట్టుబడి రాయితీ అందడంపై రైతుల హర్షం



గొల్లవిల్లిలో అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి చేను

కూటమి ప్రభుత్వం తమపై ఆదరాభిమానాలు చూపుతోందని అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

✪ ఉప్పలగుప్తం మండలంలో రైతులు నష్టపోయిన తీరుపై గత నెలల్లో 'నిండాముంచిన రంగరాజుకోడు', 'తేరుకోని పొలాలు', 'రైతన్న దిగాలు', 'అన్నదాతకు ఆదిలోనే వరుణగండం' శీర్షికలతో 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు వరి క్షేత్రాలను పరిశీలించి పంట నష్టం నమోదు చేశారు. మూడు రోజులుగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ అవుతుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలగుప్తం మండలంలో 477 మంది రైతులకు చెందిన 618 ఎకరాల్లో పంట నష్టం నమోదు చేసామని ఏవో కుమార్‌బాబు తెలిపారు. కాట్రేనికోన మండలంలో 42 మంది రైతులకు చెందిన 89 ఎకరాల్లో నష్టం నమోదు చేశామని ఏవో ప్రవీణ్ తెలిపారు.

వారం రోజుల్లో రాయితీ అందింది..



భీమనపల్లిలో ఆరు ఎకరాల్లో వరినాట్లు వేశా. వర్షాలకు నీరు దిగకపోవడంతో మొదటి దశలో పంట కుళ్లిపోయింది. వ్యవసాయ సిబ్బంది పది రోజుల క్రితం నష్టం నమోదు చేశారు. నా ఖాతాకు రూ.60 వేలు జమైనట్లు చరవాణికి సంక్షిప్త సమాచారం వచ్చింది. రెండు రోజులుగా గ్రామంలో రైతుల ఖాతాలకు డబ్బులు జమవుతున్నాయి. అన్నదాతలపై ప్రభుత్వం చూపుతున్న ఆదరణ అభినందనీయం.

– కె.సత్యబాబు, భట్నపాలెం, ఉప్పలగుప్తం మండలం

రూ.24 వేలు ఖాతాలో పడింది..

నేను రెండు న్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. వర్షాలకు పంట కుళ్లిపోయింది. అధికారులు నష్టం నమోదు చేసిన రోజుల వ్యవధిలోనే రూ.24 వేల పెట్టుబడి సాయం వచ్చినట్లు బ్యాంకు నుంచి సమాచారం అందింది. కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి. – చీకట్ల అన్నపూర్ణ, సూదాపాలెం

ప్రభుత్వానికి ధన్యవాదాలు

ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో సాగు చేపట్టా. వర్షాల కారణంగా రెండెకరాల్లో పంట నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం నమోదు చేశారు. రూ.20 వేలు ఖాతాలో జమైంది. రైతుల కష్టాలు అర్థం చేసుకుని వెంటనే స్పందించిన కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– స్వామినాయుడు, కాట్రేనికోన

ప్రభుత్వ స్పందన హర్షణీయం



ఖరీఫ్ పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం పది రోజుల్లో డబ్బులు జమ చేయడం హర్షణీయం. గత ప్రభుత్వం చేసిన అలసత్వంతో రైతులు విసిగిపోయారు. కూటమి ప్రభుత్వం చూపుతున్న ఆదరణతో రైతుల్లో నూతనోత్సాహం వచ్చింది. ఎకరాకు రూ.10 వేలు అందించడంతో అన్నదాతల కళ్లలో ఆనందం కనిపిస్తోంది.

– పినిశెట్టి సత్యనారాయణ, రైతు నాయకులు, గోవలరం

విద్యార్థినికి అభినందన



ముమ్మిడివరం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆ మంత్రిత్వశాఖ నిర్వహించిన నృత్య పోటీల్లో ముమ్మిడివరం ఆపిల్ స్కూలు విద్యార్థిని ఉత్తమ ప్రతిభతో ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న వాసంశెట్టి హరిణిప్రియ కూచిపూడి నృత్య ప్రదర్శనలో మొదటి బహుమతి అందుకుంది. విద్యార్థినిని కరస్పాండెంట్ పుండరీక్, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ ప్రభ, నృత్య ఉపాధ్యాయురాలు నల్లా హైమావతి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

జేఏవోగా ఉద్యోగోన్నతి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వశాఖల ఉద్యోగోన్నతి కమిటీ సిఫార్సు మేరకు వివిధ ప్రభుత్వశాఖల్లో పని చేస్తున్న 21 మంది సూపరింటెండెంట్లను జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆర్థిక శాఖ అండర్ సెక్రటరీ రత్న ఘోష్‌కిషోర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు యానాం విద్యాశాఖలో పనిచేస్తున్న బేతాల కమల్ ఉద్యోగోన్నతి పొంది ప్రభుత్వ ఆరోగ్యశాఖ జేఏవోగా నియమితులయ్యారు.

'సుప్రీం వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ హర్షం'

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కులం పేరుతో వేధిస్తేనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అవుతుందంటూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గతంలో అమలాపురంలో జరిగిన అల్లర్ల కేసు నమోదు కావడం వల్ల అనేక మంది యువకులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సుమారు 1500 మందికి పైగా యువకులు పాస్‌పోర్ట్ లేకపోవడంతో విదేశాలకు వెళ్లకుండా ఉండిపోయారని ఆయన అన్నారు.

రేబిస్ టీకాల పంపిణీ నేడు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం నియోజకవర్గంలోని అన్ని పశు వైద్యశాలల్లో శనివారం కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేస్తామని ఏరియా పశువైద్యశాల సహాయసంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ రేబిస్ డే సందర్భంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు సూచనల మేరకు ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. కుక్కల పెంపకందారులు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజల ఫిర్యాదుతో పరిపాలనాధికారి పరిశీలన



షేక్‌లాలావీధి వద్ద చూస్తున్న మునిస్వామి

యానాం: యానాం పాత బస్టాండు, షేక్‌లాలావీధిలో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయిన పరిస్థితిని ఆ ప్రాంత ప్రజల ఫిర్యాదు మేరకు పరిపాలనాధికారి మునిస్వామి శుక్రవారం పరిశీలించారు. షేక్‌లాలావీధిలో మురుగునీరు పొట్టి శ్రీరాములు వారధి పక్కనుంచి వేసిన జనప గొట్టం ద్వారా తోటవారీవీధిలోకి వెళ్లేలా గతంలో నిర్మించారు. ఆ గొట్టపు మార్గాన్ని శుభ్రం చేయక పోవడంతో పూడుకుపోవడంతో మురుగు వెళ్లడంకు మార్గం లేకుండాపోయింది. దీంతో పాత బస్టాండులోని దుకాణాల నీరు కదలడం లేదు. పరిస్థితిని పరిశీలించిన పరిపాలనాధికారి కాలువల్లో చెత్తను పూర్తిగా తీయించాలని కమిషనర్ రామకృష్ణను ఆదేశించారు. శనివారం పనులు మొదలుపెడతామని కమిషనర్ తెలిపారు.

పర్యాటక రంగంతో ఆర్థికాభివృద్ధికి బాటలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పర్యాటక రంగం ద్వారా ఆర్థికాభివృద్ధికి బాటలు వేయవచ్చని మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల చరిత్ర అధ్యాపకుడు పి.సూర్యనారాయణరాజు పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద 'టూరిజం అండ్ ఎకనామిక్ గ్రోత్' అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యాటక రంగం అనేది కేవలం వినోదం మాత్రమేకాదని, ఈ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి లభిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా.ఎన్.ప్రభాకర్, వైస్ ప్రిన్సిపల్ కె.చిట్టిబాబు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎస్.తులసీలక్ష్మి, సీహెచ్ పోల్నాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

అలంకారప్రాయం.. అసౌకర్యం



యానాం: పర్యాటక ప్రదేశమైన యానాం రాజీవ్ బీచ్‌లో సుందరీకరణ సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్డిని ప్రారంభించకుండా వదిలేయడంతో పర్యాటకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అన్ని మరమ్మతులు పూర్తి చేసిన మరుగుదొడ్డి, మూత్రశాల తలుపులకు తాళాలు వేసి ఉండడంతో ఆ అవసరం లకు వచ్చేవారు ఏం చేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. మరుగుదొడ్డిపై నిర్మించిన నీటిట్యాంకు నుంచి నీరు నిత్యం వృథా అవుతోందని కర్రిడి వేణుగోపాల్ శుక్రవారం సాయంత్రం ఆరోపించారు. సమస్యను మున్సిపల్ కమిషనర్ ఐండపల్లి రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లగా శనివారం ఉదయం తలుపులు తెరిపించి మరుగుదొడ్లు, మూత్రశాలలను అందుబాటులోకి తెస్తామని, నీరు వృథా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

దుస్తుల పథకం నగదుకు దరఖాస్తులు

యానాం: యానాం ప్రాంతానికి చెందిన ఎస్సీ ప్రజలకు ఈ ఏడాది దీపావళికి ఉచిత దుస్తులకు బదులుగా నగదు పంపిణీ నిమిత్తం 18 ఏళ్లు నిండిన యువతీయువకులు, ఇతర అర్హులైనవారు అక్టోబరు ఒకటో తేదీలోగా తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆదిద్రావిడ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు. వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం నకళ్లను తీసుకువచ్చి నమోదు చేయించుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

స్పందనకు స్పందన

బ్లీచింగ్ చల్లించారు

సమస్య: గెద్దనపల్లి పరిధిలో వర్షాలతో పరిసరాలు దుర్గంధంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి బ్లీచింగ్ చల్లించాలి. – ఫిర్యాదులు

పరిష్కారం: సమస్యను సర్పంచి సీతారామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో బ్లీచింగ్ చల్లించే పనులు చేయించారు.

దీపాలకు మరమ్మతులు

సమస్య: దొంతికుర్రు పంచాయతీ పరిసరాల్లో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టాలి. – గ్రామస్థులు

పరిష్కారం: పంచాయతీ సర్పంచి ఈశ్వరికి తెలుపగా స్పందించారు. సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమస్య: అమలాపురం కూరగాయల మార్కెట్‌లో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోంది. వెంటనే చర్యలు చేపట్టాలి. – రెడ్డి, వ్యాపారి

సమస్య: అమలాపురంలోని శ్రీదేవిమార్కెట్ రోడ్డు దుమ్ము, ధూళితో నిండి అపరిశుభ్రంగా తయారైంది. శుభ్రం చేయించాలి. – రవి, వ్యాపారి

సమస్య: అమలాపురం సినిమారోడ్డు డివైడర్ చుట్టూ మట్టి పేరుకుపోయింది. అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – నాయుడు, కొంకాపల్లి

పరిష్కారం: అమలాపురం పట్టణంలో కూరగాయల మార్కెట్, శ్రీదేవిమార్కెట్ రోడ్డు, సినిమారోడ్డు డివైడర్ సమస్యలను తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. సిబ్బందితో వాటిని తొలగింపజేసి, రోడ్లను శుభ్రం చేయించారు.

– న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: 79811 19595, ముమ్మిడివరం: 80085 74166

పరిష్కారం లేకుండా.. సమస్యలపై చర్చ ఎందుకు..?

అధికారుల తీరుపై కౌన్సిలర్లు సహా ఛైర్మన్ అసహనం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: వార్డుల్లో సమస్యలపై కౌన్సిల్‌లో చర్చిస్తున్నా.. పరిష్కారం కావడం లేదని అధికారులపై ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశం శుక్రవారం జరిగింది. పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ఫ్లోర్ లీడర్ ముసలపర్తి బాలకృష్ణ అన్నారు. మార్కెట్ శివారు డంపింగ్‌యార్డులో చెత్త రోడ్డు మీదకు వస్తోందని ఏడో వార్డు కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ తెలిపారు. వీధి లైట్ల నిర్వహణ బాలేదన్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో శుద్ధ్య కార్మికులు విధులకు డుమ్మాకొడుతున్నారన్నారు. సక్రమంగా పనిచేయనివారి వివరాలు చెప్పడం లేదని 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ ప్రశ్నించారు. తమ వార్డుల్లో పారిశుద్ధ్య, వీధి దీపాల సమస్యలను 9, 20వ వార్డుల కౌన్సిలర్లు అడబాల సతీష్‌కుమార్, కాండ్రేగుల సత్యవతి ప్రస్తావించారు. నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలోని



ముమ్మిడివరంలో నగర పంచాయతీ సమావేశం

చెత్త తరలింపు ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాలను సచివాలయాలకు తరలించాలన్నారు. విద్యుత్తు, వైద్యారోగ్యం, జలవనరుల శాఖ అధికారులు గైర్హాజరుపై కౌన్సిలర్లు ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కలెక్టరుకు ఫిర్యాదు చేయాలని ఛైర్మన్ సూచించారు. సీజనల్ వ్యాధులతో జనం బాధపడుతుంటే వార్డుల్లో వైద్యారోగ్యశాఖ సేవలందించడం లేదని ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ ఆరోపించారు. ఏడో వార్డు పరిధిలోని లేఅవుట్‌లో గతంలో చేపట్టిన రూ.5 లక్షల విలువైన పనులకు సంబంధించి ఆజెండాలో 5 తీర్మానాలు పొందుపర్చగా వాటిని తొలగించాలని ఛైర్మన్‌తోసహా కౌన్సిలర్లు సూచించారు. గతంలో ఇళ్ల నిర్మాణం చేపట్టి వివిధ దశల్లో నిలిచిపోయినవాటిని పూర్తి చేసేలా 'మన ఇళ్లు-మన గౌరవం' పేరుతో ఈ నెల 28న నగర పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని గృహ నిర్మాణశాఖ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ఇక్కట్లే



చెయ్యేరులో వడ్డివారిపేట నుంచి జల్లంగుంట వెళ్లే రోడ్డు గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో నిర్మించిన కంకర రోడ్డు పాడై పలుచోట్ల గుంతలు పడిందన్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరడంతో మరింత ఇబ్బందిగా ఉందంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. దీని గురించి జేఈ ఫణీంద్రను అడుగగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

విధుల్లో చేరిన సబ్‌రిజిస్ట్రార్



అమలాపురం పట్టణం: అమలాపురం పట్టణంలోని కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా ఆర్.శ్రీలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె తూర్పుగోదావరి జిల్లా ద్రాక్షారామ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన రత్నకుమార్ ఆత్రేయపురం బదిలీ అయ్యారు.

ఏడీఈగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



ముమ్మిడివరం: ముమ్మిడివరం ఏడీఈగా శ్రీనివాసరావు స్థానిక విద్యుత్తుశాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ ఏడీఈగా పనిచేసిన వెంకటేశ్వరరావు కాకినాడకు బదిలీ కాగా, ఏలూరు సిటీ ఏడీఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఏడీఈకి ఏఈలు, సిబ్బంది స్వాగతం పలికారు.

కిసాన్ మోర్చా నాయకుడికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న పవన్

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: న్యూఢిల్లీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో వ్యవసాయ రంగంలో రాణిస్తున్న వారికి సంబంధించి నిర్వహించిన సర్వేలో అమలాపురం పట్టణానికి చెందిన భాజపా కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు దక్కింది. ఉత్తర్‌ప్రదేశ్ ఎంపీ చందన్‌చౌహాన్, సీతాశర్మ, అజయ్‌పాండా, దీపక్‌శర్మల చేతుల మీదుగా ఈ నెల 26న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకున్నట్లు పవన్ శుక్రవారం తెలిపారు. పలువురు నాయకులు ఆయన్ను అభినందించారు.

ఓఎన్జీసీ పరిహారం ఇప్పించండి



ఎంపీతో నాగిడి తదితరులు

కాట్రేనికోన: తీర గ్రామాల్లో మత్స్యకారులకు రావాల్సిన ఓఎన్జీసీ నష్టపరిహార సొమ్మును త్వరితగతిన ఇప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు ఎంపీ హరీష్‌మాధుర్‌ను అమలాపురంలో కలిసి కోరారు. శుక్రవారం ఎంపీతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో భాగంగా రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడిగా నాగిడిని ఎంపిక చేశారు. గతంలో మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన ఎన్నో పదవులు చేపట్టిన తనను డైరెక్టరుగా నియమించడంపై నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. సముచిత స్థానం కల్పించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి మాట్లాడతానని ఎంపీ హామీ ఇచ్చారని నాగిడి తెలిపారు. దండప్రోలు సత్యం, లింగేశ్వరరావు తదితరులు వెంట ఉన్నారు.

రవాణా ప్రణాళికపై కార్యశాల

అల్లవరం, న్యూస్‌టుడే: బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో నగర రవాణా ప్రణాళికపై సాంకేతిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ ఎన్ఐటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రమూరా హెజ్జాజ్ పలు అంశాలను వివరించారు. రవాణాలో ప్రస్తుతం ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రమౌళి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.



పునాది దశ దాటని అదనపు తరగతి గదుల నిర్మాణం



పెచ్చులూడుతున్న స్లాబ్



భవనం ముందుభాగంలో కారిడార్ ఇలా..

నాడు-నేడు పనులు.. పూర్తికాక అవస్థలు

గత ప్రభుత్వంలో ఆర్భాటంగా నాడు-నేడులో భాగంగా పాఠశాలల్లో చేపట్టిన నిర్మాణాలు పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గన్నవరం కార్పొరేషన్ ఇవ్వకపోవడంతో.. కాట్రేనికోన మండలం పోర జడ్పీ పాఠశాలలో 180 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ నాడు-నేడు రెండో విడతలో భాగంగా ఏడాదిన్నర క్రితం చేపట్టిన పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. విద్యుత్తు, టైల్స్, గ్రిల్స్ ఏర్పాటు వంటివి చేపట్టారు. ఐదికొండా మూత్రశాలలు, మరుగుదొడ్డు, గతేడాది అదనపు తరగతి గదులు చేపట్టారు. ఐదేవీ పూర్తికాలేదు. పాఠశాల భవనం ముందు, వెనుక స్లాబ్ పెచ్చులూడుతోంది. కొన్ని కిటికీలు ఏర్పాటు చేయలేదు. పాత మరుగుదొడ్లనే విద్యార్థులు వినియోగిస్తున్నారు. బాలురకు మరుగుదొడ్లు లేవు. పిల్లలతోపాటు ఉపాధ్యాయులు ఇబ్బందిపడుతున్న పరిస్థితి ఉంది. తీర ప్రాంతం కావడంతో అదనపు తరగతి గదుల నిర్మాణంలో జాప్యం కారణంగా ఈ ఏడాది తుఫాన్లు వస్తే భవనం కూలే ప్రమాదం పొంచి ఉంది. పాఠశాలలో తుప్పు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి హెచ్ఎం రామారావు వివరణకోరగా నిధుల కొరతతో పనులు నిలిచాయని, వచ్చిన వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

– న్యూస్‌టుడే, కాట్రేనికోన

60 చోరీల కేసులో నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు అర్బన్(హైదరాబాద్): పటాన్‌చెరు చిట్కుల్ రాధమ్మకాలనీకి చెందిన వైద్యుడు కిరణ్ ఇంట్లో ఈ నెల 28న 20 తులాల బంగారం చోరీ చేసింది పాత నేరస్థుడు దుర్గాప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని యానాం వద్ద అదుపులోకి తీసుకున్నారు. విచారణలో శామ్యూల్‌రాజ్ అనే నిందితుడితో కలిసి చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. రిమాండ్‌కు తరలించారు. అతను 60 చోరీల కేసుల్లో నిందితుడని పోలీసులు తెలిపారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మారేడుబాకలో సామూహిక సీమంతాలు

మండపేట గ్రామీణం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని మారేడు బాక సర్పంచి గోవిందరాజు పేర్కొన్నారు. పౌష్టి కాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద శుక్ర వారం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సర్పంచి, పంచాయతీ కార్యదర్శి సాయి ప్రసాద్ తదిత రులు పరిశీలించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.

యోగా, ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, న్యూస్‌టుడే: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని విశ్వమానవతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి అన్నారు. మండలం లోని పసలపూడిలో సంపూర్ణ ఆరోగ్యం-యోగసాధన అంశంపై శుక్ర వారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి నియమాలు, నిత్య యోగసాధన ద్వారా దీర్ఘకాల రోగాల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. విద్యార్థులకు రాత, రాజపథం పుస్తకాలు, 60 మందికి హోమియో మందులు అంద జేశారు. కార్యక్రమంలో వైద్యులు సత్యభావని, సుబ్బరాజు, దివ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్ చౌదరి

రావులపేటలో అన్నదానం

మండపేట: గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా రావులపేట గంగమ్మ వారి వీధిలో శుక్రవారం అన్నదానం చేశారు. విజయ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 3,500 మంది అన్నప్రసాదం స్వీకరించారు.

30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట, న్యూస్‌టుడే: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తు న్నట్లు ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తెలి పారు. పలు అంశాలను అజెండాలో పొందుపర చామని, సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మండపేట: పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదు ర్గారాణి శుక్రవారం పరిశీలించారు. ఆలమూరు రోడ్డు, డొక్కా సీతమ్మ భవనం, పలు వీధులను పరి శీలించి పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేశారు.

విష్ణుకు సత్కారం

ద్వారపూడి: మండపేట మండలం కేశవరా నికి చెందిన ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సమితి వ్యవస్థాపకుడు, గ్రామీణ వైద్యుడు పెదపాటి విష్ణు గిన్నిస్ రికార్డులో స్థానం సాధించడంతో శుక్ర వారం సంస్థ సభ్యులు, స్నేహితులు అభినంద నలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో పిల్లా రాంబాబు, కరుమూరి సురేష్, నాగేశ్వరరావు, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

హలధారీ.. పొలం పిలుస్తోంది..!

సాగును లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా కార్యక్రమం

మూస పద్ధతుల్లో పంటల సాగుకు స్వస్తి పలికి నూతన విధానాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చ డమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్య క్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయానికి అనుబం ధంగా ఉన్న మరో 14 శాఖల సేవలను సద్వినియోగం చేసుకునేలా అందరి భాగస్వామ్యంతో ముందడుగు వేస్తోంది. పెట్టుబడి తగ్గించి పంట దిగుబడి, ఆదాయం పెంచడమే ధ్యేయంగా వ్యవసాయ, అనుబంధశాఖల అధి కారులు పొలం బాట పట్టారు. మండపేట, రామచంద్ర పురం నియోజకవర్గాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మొదలయ్యాయి.

– న్యూస్‌టుడే, అంగర

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో సాగు వివరాలిలా (ఎకరాల్లో)..

మండలం	సాగు విస్తీర్ణం
మండపేట	16,191
రాయవరం	15,028
కపిలేశ్వరపురం	16,200
రామచంద్రపురం	19,582
కె.గంగవరం	21,420
కాజులూరు	19,078



కేదార్లంకలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

రైతులకు కలుసుకొని..

రెండు నియోజకవర్గాల్లోని కొన్ని గ్రామాల్లో సాగు చేసిన పంటలు జలమయం వర్షాల వరదలు, వర్షాలకు దెబ్బతిన్నాయి. సమృద్ధిగా నీరందిన చోట్ల కొంత వరకు బాగున్నాయి. వ్యవసాయ అనుబంధ శాఖలైన మత్స్య, ఉద్యాన, పశు సంవర్ధక, మార్కెటింగ్ అధికా రులు పొలం బాట పట్టాలని ప్రభుత్వం నిర్దేశించింది. వీరంతా రైతులను కలుసుకుని, క్షేత్రస్థాయిలో పంట లను పరిశీలిస్తారు. సాగు కష్టాలను తెలుసుకోవడమే కాకుండా దిగుబడి పరిస్థితులు, పంటల మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు.

వారంలో రెండు రోజులు..

ప్రతీ మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించేలా మార్గదర్శకాలు వెలువడ్డాయి. రెండు గ్రామాల చొప్పున అధికారులు పర్యటించి, పొలాలను సందర్శిస్తారు. అక్కడే రైతులతో మాట్లాడి, సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు విడుదలయ్యాయి. ఇప్పటికే ఏ రోజున ఏ గ్రామంలో కార్యక్రమం చేపట్ట లనే విషయాలపై వ్యవసాయ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఖరీఫ్‌లో నాలుగు, రబీలో నాలుగు నెలలు కార్యక్రమం చేపట్టనున్నారు.

లోపాలు గుర్తించి.. లాభాల బాట పట్టించి..

సాగు చేసిన పంటలను పరిశీలించి చీడపీడలను సకా లంలో గుర్తించనున్నారు. దిగుబడి తగ్గడానికి కారణాలు విశ్లేషించి వెంటనే పెంపునకు చర్యలు తీసుకున్నారు. సూక్ష్మ పోషకాల లోపాల్ని గుర్తించి, భూసారం పెంచేలా సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. తుంపర, బిందు సేద్యం విధానంలో పంటల సాగును ప్రోత్సహించను న్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీ, రైతు మిత్ర సంఘాల ఏర్పాటు, వ్యవసాయ సంఘాల ద్వారా పంట పెట్టుబడులకు రుణాల మంజూరు, ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించడం, రసాయన ఎరువుల వాడ కాన్ని తగ్గించడం, డ్రోన్ టెక్నాలజీ, విత్తనశుద్ధి తదితర అంశాలపై ప్రదానంగా దృష్టి సారించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

రైతులకు ఉపయుక్తంగా ఉండేలా పొలం పిలు స్తోంది కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. పెట్టుబడి తగ్గించి.. దిగుబడి, ఆదాయం పెంపునకు తోడ్పాటు అందిస్తాం. ఆధునిక సేద్య విధానాలను అన్నదాతలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టింది. అధికారుల సూచనలు పాటించి, రైతులం దరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కేబీఎస్ రమేష్‌కుమార్, ఇన్‌ఛార్జి ఏడీ, వ్యవసాయ శాఖ

'వైకాపా హయాంలో తిరుమల పవిత్రతకు భంగం'

మండపేట: వైకాపా పాలనలో తిరుమలను అపవిత్రం చేసి, ప్రతిష్టకు భంగం కలిగించారని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. మండపేటలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అయిదేళ్ల వైకాపా పాలనలో జరిగిన అనేక అవకతవకలను బయట పెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి ఉపయో గించిన విషయం బయటపడిందన్నారు. జరిగిన తప్పును వెంకటేశ్వర స్వామి వారికి క్షమాపణలు చెప్పుకోవడం మానేసి, తప్పును కప్పిపుచ్చుకో నేందుకు జగన్, వైకాపా నాయకులు ఎదురుదాడి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే శనివారం స్థానిక వెంకటేశ్వరస్వామివారి ఆల యంలో ఎమ్మెల్యే త్రిమూర్తులు పూజలు చేయడానికి సిద్ధపడ్డారని, దీనిని కచ్చితంగా అడ్డుకుంటామన్నారు.

అవకతవకలపై సమాధానం చెప్పి పూజలు చేయాలి..

మండపేట గ్రామీణం: తిరుమలలో అవకతవకలపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమాధానం చెప్పి ఆలయంలో పూజలు నిర్వహించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుళ్ల లీలాకృష్ణ పేర్కొన్నారు. కూటమి అగ్రనాయకుల ఆదేశాలతో వైకాపా చేపట్టే కార్యక్రమాన్ని తాము అడ్డుకోమని స్పష్టం చేశారు.

జగన్ తిరుపతి వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాల్సిందే

రామచంద్రపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరు పతి వెళ్తే డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని తెదేపా పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, జనసేన అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సత్యవాడ శ్రీహరి పంతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో ఎస్.సుధా సాగర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

సీనియర్ ఉపాధ్యాయినికి సన్మానం

ద్రాక్షారామ: వేగాయమ్మపేట ఎలీఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయిని దేవళ్ల నాగమణి 35 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్ర వారం పాఠశాలలో ఆమెను సిబ్బంది, గ్రామస్థులు సన్మానించారు. పాఠ శాల అభివృద్ధికి ఆమె చేసిన కృషి, విద్యార్థులను తీర్చిదిద్దిన విధానాన్ని ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, వి.నాగేశ్వరి కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, సహోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్తుశాఖ ఏఈలకు..

విద్యుత్తు శాఖ ద్రాక్షారామ ఏఈగా పని చేసి ముమ్మిడివరానికి బది లీపై వెళ్లిన శీలం ఏసురాజు, రామచంద్రపురం పట్టణ ఏఈగా పని చేస్తూ ద్రాక్షారామకు బదిలీపై వచ్చిన మేడిశెట్టి వెంకటరమణను శుక్ర వారం ఉపకేంద్ర పరిధిలో పనిచేసే సిబ్బంది సత్కరించారు. వెంకటర మణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

పామర్రు, న్యూస్‌టుడే: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలం లోని పామర్రు, దంగేరు, కోటిపల్లి, దంగేరు, కుందూరు, సత్యవాడ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ది గాడ్ ఈజ్ ట్రూ ఫ్రెండ్ అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు అందజేస్తామన్నారు. పాఠశాల పోటీల్లో విజేతలకు మండల స్థాయిలోనూ, అక్కడి విజేతలకు జిల్లా స్థాయిలోనూ పోటీలుంటా యని నిర్వాహకులు రావిపాటి నారాయణరావు, తదితరులు తెలిపారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు సాయిదేవి



సాయిదేవి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: స్థానిక మోడరన్ జి.ఆర్.సి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎ.ఎస్.ఎస్.సాయిదేవి జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని జట్టుకు ఎంపికైనట్లు విద్యాసంస్థల అధి నేత జి.వి.రావు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆమెను ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపల్ పి.ఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్.శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయికి..

మోడరన్ హైస్కూల్ విద్యార్థులు కె.హర్ష, జి.రామ దుర్గ ప్రసాద్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, ఐ. చైతన్య వాలీ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వారిని సంస్థ అధినేత జి.వి.రావు, అకడమిక్ డైరెక్టర్ ఆర్.వీర్రాజు చౌదరి, ఆర్.ఉమాదేవి, ప్రధానోపాధ్యాయుడు ఎం.చిట్టి బాబు అభినందించారు.

జిల్లా పోటీలకు వెలగతోడు విద్యార్థులు

మండపేట గ్రామీణం: తమ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వెలగతోడు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోట్ల లక్ష్మీనారా యణ తెలిపారు. అండర్-17 షటిల్ బ్యాడ్మింటన్‌లో ముత్యాలరాజు, మధు, కబడ్డీలో దుర్గారావు, కె.దేవి ప్రసాద్, పరుగు పందెంలో ఆర్.సంతోష్‌కుమార్, జావలిన్ త్రోలో దుర్గారావు, ఖోఖోలో ఆర్.సతీష్‌కుమార్, అండర్-14 కబడ్డీలో కె.కిషోర్‌కుమార్, బి.హైమిషా, వి.దివ్య, ఖోఖోలో టి.సాయికుమార్, అఖిల్, అలేఖ్య, పరుగు పందెంలో అఖిల్, అండర్-17 బాలికల విభాగం కబ డ్డీలో కె.సాయి ప్రసన్న, ఖోఖోలో కె.మైలీ గ్రేస్, యోగాలో ఎస్.ఇందు జిల్లా స్థాయికి ఎంపికయ్యారా న్నారు. వీరిని సర్పంచి నలమామిడి కృపరాజు, ఎస్ఎంసీ ఛైర్మన్ రెడ్డి సురేష్, ఎంఈవోలు నాయుడు రామచంద్ర రావు, సోమిరెడ్డి అభినందించారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: రామచంద్రపురం మండలంలో అధ్వానంగా ఉన్న మూడు రహ దారుల నిర్మాణానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లలో శుక్ర వారం శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన ద్రాక్షారామ నుంచి వెల్ల, వెల్ల నుంచి కందులపాలెం, నరసాపుర పుపేట నుంచి యనమదల వెళ్లే రహదారులకు రూ.253.05 లక్షల ఏపీఎం నిధులతో అభివృద్ధి చేయ నున్నారు. దీనికి సంబంధించి వెల్ల వంతెన వద్ద శిలాఫలకాన్ని మంత్రి ఆవి ష్కరించారు. నిర్మాణ పనులు త్వరలోనే మొదలు పెడతారని తెలిపారు. కార్యక్ర మంలో వెల్ల, ద్రాక్షారామ, యనమదల, కందులపాలెం సర్పంచులు సూరిబాబు, అరుణ, వీరవెంకటరమణ, కృష్ణవేణి, వెల్ల ఎంపీటీసీ సభ్యుడు చిక్కాల స్వామి, పంచా యతీరాజ్ ఇంజినీరు ఏసురాజు, భూషణ్ ప్రసాద్ పాల్గొన్నారు.



వెల్లలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

చెత్త తొలగదు.. సమస్య తీరదు

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది.. పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మారే డుబాక, పేకేటిపాకల, ఇప్పనపాడు, తాపే శ్వరం, కేశవరం, ఏడిద సీతానగరం, ఏడిద, వెలగతోడు గ్రామాల్లో సేకరించిన చెత్తా చెదారాన్ని, ఇళ్లలోని వ్యర్థాలను రహదారి మార్జిన్లలో వేస్తున్నారు. రోజుల తరబడి వాటిని తొలగించకపోవడంతో దుర్వాసన వెలువడుతుంది. అటుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. దీనిపై డీఎల్‌పీవో అయిదం రాజును వివరణ కోరగా రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి అంచుల వద్ద వేయకుండా చర్యలు తీసుకుంటున్నామని, దీనిపై పంచాయతీ సిబ్బందికి మరింత అవగా హన కల్పిస్తామన్నారు.



– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కోడిగుడ్ల సరఫరా

అంగర, న్యూస్‌టుడే: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించి మాతా,శిశు మరణాలను నివారిం చేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రోజూ సంపూర్ణ ఆహారం, ఉడకబెట్టిన గుడ్డు ఒకటి చొప్పున నెలకు 25 గుడ్లు, పాలు, చిన్నా రులకు బాలామృతం అందిస్తున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారు లకు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నాణ్యమైన గుడ్లు సరఫరా చేయడం లేదు. కపిలేశ్వరపురం మండలం అంగర లోని ఒక అంగన్‌వాడీ కేంద్రానికి ఈ నెలలో సరఫరా చేసిన గుడ్డు బయట మార్కెట్లలో దొరికే వాటికంటే చాలా చిన్నవిగా ఉన్నాయి. దీంతో చిన్నారులకు సరైన పోషకాహారం అందడంలేదు. దీనిపై స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం అంగర పల్లపువీధిలో శ్రీవిజయ దుర్గ అమ్మవారి దసరా ఉత్సవాలకు శుక్ర వారం శ్రీకారం చుట్టారు. పురోహితులు వార ణాసి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపి, పందిరి రాట ఏర్పాటు చేశారు. వచ్చేనెల 3 నుంచి 12వ వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలి పారు. అంగర వీవర్స్ కాలనీలోని విజయక నకదుర్గ ఆలయం వద్ద అర్చకులు కొలువుల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.



పీఠంలో..

రాయవరం: వెదురుపాక విజయ దుర్గా పీఠంలో 59వ శరన్నవరాత్రి ఉత్సవాలకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. పీఠాధిపతి కుమారులు సత్య వెంకట కామేశ్వర, కనకదుర్గ పూజలు నిర్వహించి పందిళ్ల పనులకు శ్రీకారం చుట్టారు.

సీసీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

మండపేట: మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆలమూరు రోడ్డులోని డ్రెయిన్‌కు ఇరుపైపులా పెరిగిన తుప్పల తొలగింపునకు చేపట్టిన పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం పరిశీ లించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. మండ పేట పెద్ద కాలువ అర్టీసీ నుంచి గుమ్మి లేరు రోడ్డు బైపాస్ అర్టీసీ వరకు మూడు కిలో మీటర్ల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతి పాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, కమిషనర్ రంగారావు, డీఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

'సుప్రీం వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ హర్షం'

అమలాపురం పట్టణం: కులం పేరుతో వేధిస్తే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అవుతుందంటూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారా యణరావు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. గతంలో అమలాపురంలో జరిగిన అల్లర్ల కేసు నమోదు కావడం వల్ల అనేక మంది యువకులు నేటికీ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సుమారు 1500 మందిపైగా యువకుల పాస్ పోర్టు లేకపోవడంతో విదేశాలకు వెళ్లకుండా ఉండిపోయారని ఆయన అన్నారు.

వర్షం.. పల్లపు ప్రాంతాలు జలమయం

ద్వారపూడి, న్యూస్‌టుడే: మండపేట మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షంతో జనజీవనం అస్తవ్య స్తంగా మారింది. పల్లపు వీధులు జలమ యమయ్యాయి. ద్వారపూడి, కేశవరం, జడ్.మేడపాడు గ్రామాల్లో డ్రెయినేజీలు నిండిపోయి మురుగు రహదారు లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బం దులు పడ్డారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడాల్సి వచ్చింది. ద్వారపూడిలోని పంగిడి, కేశవరంలోని గనిపోతురాజు చెరు వులు పొంగి ప్రవహిస్తున్నాయి. కాజ్‌వే పై నుంచి నీరు పారుతుండ డంతో వాహనచోదకులకు అవస్థల తప్పడం లేదు.



నిండుకుండలా గనిపోతురాజు చెరువు



కాజ్‌వే పైనుంచి పొంగి ప్రవహిస్తున్న నీరు

మండపేట, గ్రామీణం: మండపేట పట్టణ పరిధిలో శుక్రవారం ఉదయం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు వర్షం కురిసింది. గాంధీనగర్, పార్థసారథి నగర్‌లో డ్రెయినేజీలు పొంగి మురుగు రోడ్లపైకి చేరింది.

పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు ఆర్థిక సాయం

ద్రాక్షారామ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రామచంద్రపురం మండలంలో అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం, విజన్-2047, ఉపాధి పథకం, గృహ నిర్మాణం, ఇది మంచి ప్రభుత్వం అంశాలపై గ్రామ సభలు నిర్వహించారు. హసనబాదలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచి నాగిరెడ్డి సతీష్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామసభలో పారి శుద్ధ్య కార్మికుల పిల్లలకు సర్పంచి సొంతఖర్చుతో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ చింతపల్లి వీరభద్రరావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. కార్య క్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నాగులచెరువులో అసంపూర్తిగా పాఠశాల భవనం

పూర్తికాని పనులు.. పరాయి పంచన చదువులు

కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు మండల పరిషత్తు ప్రాథ మిక పాఠశాల భవన నిర్మాణానికి నాడు-నేడు రెండో విడతలో రూ. 29 లక్షలు మంజూరయ్యాయి. అవి ఎటూ చాలకపోవడంతో రెండే శ్లాబుల నిర్మాణ పనులు సగుతూనే ఉన్నాయి. కనీసం స్లాబు వరకు కూడా పూర్తి కాలేదు. దీంతో స్థానిక పంచా యతీ కార్యాలయంలో తరగతులు నిర్వహిస్తు న్నారు. సంబంధిత అధికారులు స్పందించి భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయడానికి తగు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో కె.తాతారావును వివరణ కోరగా సమస్యను ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పనులు జరిగేలా చూస్తున్నామన్నారు.



పంచాయతీ కార్యాలయంలో తరగతులు

– న్యూస్‌టుడే, అంగర

పోటీకెళితే పతకమే..!

రామచంద్రపురం పట్టణం, తోటపేటకు చెందిన చిన్నారులు కిక్ బాక్సింగ్, కరాటేపై మక్కువ పెంచు కొని.. మెలకువలు ఒంటబట్టించుకొని ప్రతిభ చాటుతున్నారు. పాల్గొన్న ప్రతి పోటీలోను పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే లక్ష్యమని చెబుతు న్నారు. ఈ చిచ్చర పిడుగుల గురించి తెలుసుకుం దామా..

– న్యూస్‌టుడే, రామచంద్రపురం

☛ రామచంద్రపురం పట్టణానికి చెందిన కడియాల సద్గురు స్థానిక ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. తండ్రి లక్ష్మీనారా యణ పోలీస్ కానిస్టేబుల్, తల్లి నాగలక్ష్మి గృహిణి. సద్గురు చిన్న నాటి నుంచే కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపుతూ పతకాలు సాధి స్తున్నాడు. ఈ ఏడాది మే 4న విశాఖపట్నంలో జరి గిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. జులై 2, ఆగస్టు 10న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కాంస్య, రజత పతకాలు సాధించాడు. ఏలూరులో ఈ 15న జరి గిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం దక్కించుకున్నాడు. గ్రూప్-1 అధికారి కావ డమే తన లక్ష్యమని చెబుతున్నాడు.



☛ రామచంద్రపురం మండలం తోటపేట కు చెందిన అల్లం దాలిశ్రీ దుర్గా మణి ప్రభ స్థానిక ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. తండ్రి రాజేష్ తాపీ మేస్త్రీ, తల్లి దుర్గ గృహిణి. చిన్న నాటి నుంచి కిక్ బాక్సింగ్‌పై మక్కువ పెంచుకుని ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో పది పతకాలు సాధించింది. గత ఏడాది సెప్టెంబరు 17న విశాఖపట్నంలో, ఈ నెల 10న రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పత కాలు సాధించింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమంటోంది.



☛ రామచంద్రపురం పట్టణానికి చెందిన కరుమూరి లేఖ నిహారిక స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఏడో తర గతి చదువుతోంది. తండ్రి బాలరాజు, తల్లి దేవీప్రియ ప్రైవేటు ఉద్యోగులు. నిహారిక ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో పలు పత కాలు సాధిం చింది. ఈ ఏడాది మే 22 నుంచి 26వ తేదీ వరకు మహా రాష్ట్రలోని పూణె బలేవాడి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ లైట్ కాంటాక్ట్, కిక్‌లైట్, క్రియేటివ్ ఫామ్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించింది. రెండు కాంస్య, ఒక రజత పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయిలో గత ఏడాది డిసెంబరు 15,16, ఈ ఏడాది మే 4,5, ఆగస్టు 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. కరా టేలో చాంపియన్‌షిప్ ట్రోఫీ గెలుపొం దారు. పోలీసు ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ 10 గం॥ నుంచి సా॥ 5గం॥ వరకు

ద్రాక్షారామ: 80085 74192, ద్వారపూడి: 91543 96553

సమస్య: ఏడిద- ఏడిదసీతాన గరం రహదారి పక్కన చెత్త తరు ల పేరుకుపోతుంది. దాన్నుంచి వస్తున్న పొగ కారణంగా అటుగా వెళ్లే వాహనచోదకులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– రమేష్, ఏడిద సీతానగరం

సమాధానం: రహదారి పక్క లను చెత్తను తగులబెట్టకుండా చర్యలు తీసుకుంటాం.

–వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శి

సమస్య: తాపేశ్వరం ఎస్సీ కాల నీలో వారం రోజులుగా మురుగు పారడం లేదు. పంచాయతీ అధికా రులకు తెలియజేసినా పట్టించుకో వడం లేదు.

–మూర్తి, తాపేశ్వరం

సమాధానం: డ్రెయినేజీ పరిశీ లించి సోమవారం సాయంత్రానికి చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం